# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 176 బుధవారం 23 ఆగస్ట్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## కేసీఆర్ లెక్క ఏంటి... దానికి లక్కేంటి

హైదరాబాద్, ఆగస్టు 22

కేసీఆర్ ఏం చేసినా ఓ లెక్కుంటుంది. ఆయనకు లక్కు కూడా ఉంటుంది అంటుంటారు అందరూ.. ఆయనకు లెక్కే కాదు.. లెక్కలేని తనం కూడా ఎక్కువే అంటారు కొందరు. ఎవరేమనుకున్నా.. కేసీఆర్ మాత్రం ఆయన అనుకున్నదే చేస్తారు. మరిప్పుడేం చేశారంటే.. ఎన్నికలకు మూడునెలల ముందుగానే అభ్యర్థులను ప్రకటించారు. అంతే కాదు అందరికీ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. అదేంటంటే.. ఈసారి ఆయన రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నారు. యుద్ధంలో మొదటి అడుగుకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్ అంటుంటారు దాన్ని. తెలంగాణ ఎన్నికల కురుక్షేత్రంలో మొదటి అడుగు వేసేశారు కేసీఆర్. 2018 ఎన్నికల స్ట్రాటజీనే యాజ్ ఇట్ ఈజ్ గా అమలు చేస్తున్నారు. అప్పుడు మొదటి విడత 105 స్థానాలకు టికెట్లు ఇస్తే.. ఈ సారి ఏకంగా 115 సీట్లు అనౌన్స్ చేశారు. కేసీఆర్ ముందు చెప్పినట్లుగా

02

## ఇస్రో చారిత్రాక ఘట్టానికి గంటల సమయం

### ప్రపంచమంతా ఎదురుచూపులు

శ్రీహరికోట, ఆగస్టు 22



మరికొన్ని గంటల్లో ఇస్రో చరిత్ర పుటల్లోకి ఎక్కనుంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన మొదటి దేశంగా నిలిచేందుకు సిద్ధమైంది. బుధవారం ఉదయం 6.04 గంటలకు చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ కానుంది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా తీర్చిదిద్దిన విక్రమ్ ల్యాండర్ ప్రణాళికాబద్ధంగా ల్యాండ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది. విక్రమ్ ల్యాండర్ సజావుగా దిగితే.. చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన మొదటి దేశంగా భారత్ నిలుస్తుంది. అయితే ఇక్కడితో పని అయిపోలేదు. చంద్రయాన్-3 మిషన్ షెడ్యూల్ ప్రకారం సాఫీగా సాగుతోందని ఇస్రో ప్రకటించింది. సిస్టమ్స్ అన్నీ తనిఖీ చేపట్టామని అన్నీ నార్మల్‌గా వర్క్ చేస్తున్నట్టు పేర్కొంది. విక్రమ్ ల్యాండర్ ల్యాండింగ్ ప్రక్రియను ఆగస్టు 23 సాయంత్రం ఐదు గంటల ఇరవై నిమిషాల నుంచి ప్రత్యక్ష ప్రసారం చేయబోతున్నట్టుఇస్రో ప్రకటించింది. రెండు రోజుల క్రితం చంద్రునికి దాదాపు 70 కి.మీ ఎత్తు నుండి తీసిన ఫొటోలను ఇస్రో షేర్ చేసింది. ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా ద్వారా ఈ చిత్రాలను సేకరించారు. ఒఖఆఅ పంపిన చిత్రాలు ల్యాండర్ మాడ్యూల్‌ను ఆన్‌బోర్డ్ మూన్ రిఫరెన్స్ మ్యాప్‌తో సరిపోల్చడం ద్వారా దాని గమనాన్ని తెలుసుకోవచ్చని పేర్కొంది. విక్రమ్ ల్యాండిగ్ అనేది చంద్రయాన్-3 ప్రయోగంలో సగం మాత్రమే. మరో సగం.. ల్యాండర్ దిగిన తర్వాత ప్రారంభం అవుతుంది. అయితే సాఫ్ట్ ల్యాండింగే ఈ ప్రయోగంలో అత్యంత కీలకమైనది. ఎందుకంటే ఈ దశలోనే చంద్రయాన్-2 విఫలమైంది. మరి చంద్రయాన్-3 లో భాగంగా చంద్రుడిపైకి చేరిన విక్రమ్ ల్యాండర్ అద్భుతాలు చేస్తుందని ఇస్రో అంచనా వేస్తోంది. ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడిపై ఒక రోజు తనకు నిర్దేశించిన కార్యకలాపాలు సాగించనుంది. చంద్రుడిపై ఒక రోజు అంటే భూమిపై 14 రోజులకు సమానం. ప్రజ్ఞాన్ రోవర్ లోని ఐదు మాడ్యుల్స్ నుంచి వచ్చే టన్నుల కొద్దీ డేటాను విశ్లేషించడం ఇక్కడ భారతీయ శాస్త్రవేత్తల పని. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన సుమారు 4 గంటల తర్వాత ల్యాండర్ కు ఒక వైపు ఉన్న ప్యానెల్ ఓపెన్ అవుతుంది. ఆ తర్వాత ఓ ర్యాంప్ వస్తుంది. ఈ ర్యాంప్ పై నుంచి 6 చక్రాలు ఉన్న ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడిపైకి దిగుతుంది. జాతీయ త్రివర్ణ పతాకం, చక్రాలకు ఇస్రో లోగోతో ప్రజ్ఞాన్ రోవర్ దిగుతుంది. సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో రోవర్ కదులుతూ చంద్రుని పరిసరాలను స్కాన్ చేస్తూ ఆ డేటాను ల్యాండర్ కు పంపిస్తుంది. పేలోడ్స్ కాన్ఫిగర్ చేసిన టూల్స్ ఆ డేటాను గ్రహిస్తాయి. మూడు పేలోడ్స్ విక్రమ్ ల్యాండర్ ఉపరితల ప్లాస్మా (అయాన్లు, ఎలక్ట్రాన్ లు) సాంద్రతను కొలుస్తుంది. చంద్రుడి ఉపరితలం ఉష్ణ లక్షణాల కొలతలను నిర్వహిస్తుంది. ల్యాండింగ్ సైట్ చుట్టూ భూ స్వభావాన్ని అంచనా వేస్తుంది.

02

## హవాయి ద్వీపం లో కార్చిచ్చు



### సుమారు 800 మంది మిస్సింగ్

లహైనా ఆగష్టు 22

అమెరికా ద్వీపమైన హవాయిలో కార్చిచ్చుపెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఆ భారీ దావానలం ధాటికి ఆ ద్వీపంలోని లహైనా పట్టణంలో అనూహ్యమైన విధ్వంసం చోటుచేసుకున్నది. రాత్రికి రాత్రే వచ్చిన ఆ కార్చిచ్చులో వందల సంఖ్యలో ఇండ్లు కాలిపోయాయి. అనేక బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. అయితే ఆ ప్రమాదంలో సుమారు 800 మంది మిస్సింగ్ అయినట్లు కూడా తెలుస్తోంది. ఆ అగ్నికీలల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చాలా మంది సముద్రంలో దూకారు. కొందరు కార్లలోనే కాలిపోయారు. కొందరు ఆచూకీ లేకుండాపోయారు ఇప్పటి వరకు ఇంకా 800 మంది లెక్క దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. మవాయి మేయర్ రిచర్డ్ బిస్సేన్ ప్రకారం 850 మంది మిస్సింగ్‌లో ఉన్నారు. అయితే అధ్యక్షుడు బైడెన్ పర్యటన సందర్భంగా సోమవారం వైట్‌హౌజ్ కూడా ఓ ప్రకటన చేసింది. శ్వేతసౌధం సెక్యూర్టీ అడ్వైజర్ ప్రకారం సుమారు 500 నుంచి 800 మంది వరకు మిస్సింగ్ జాబితాలో ఉన్నట్లు తెలిపారు. ఇక అమెరికన్ రెడ్ క్రాస్ సొసైటీ తమ జాబితాను కూడా రిలీజ్ చేసింది.

## లడాఖ్ ప్రాంతంలో ఎత్తైన ఫెన్సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 22




మన సరిహద్దు ప్రాంతాలపై కన్నేసి.. నిరంతరం ఇబ్బంది పెట్టాలని చూసే డ్రాగన్ కంట్రీ ఆలోచనలకు చెక్ పెట్టేదిశగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చైనా సరిహద్దులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రహదారి నిర్మాణాన్ని భారత్ ప్రారంభించింది. 19400 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత మనదేశం తన రికార్డును తానే బ్రేక్ చేసి సరికొత్త రికార్డ్ ను సృష్టిస్తుంది. ఇక్కడ ఫైటర్ జెట్ బేస్ కూడా నిర్మించబడుతుంది. తద్వారా చైనా విషయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే.. ఈ రహదారిని ఉపయోగించి.. తగిన సమాధానం చెప్పవచ్చు. ఇప్పటి వరకు ప్రపంచంలోనే ఎత్తైన రహదారి కూడా మన దేశంలోనే ఉంది. ఈ రహదారి ఉమ్లింగ్ లాలో ఉంది. దీనిని 19024 అడుగుల ఎత్తులో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నిర్మించింది. ఆర్మీ వాహనాల రాకపోకలకు ప్రత్యేకంగా ఈ రహదారిని సిద్ధం చేశారు. ఈ రహదారిని ఃఖీూ మహిళా అధికారి వైశాలి ఎస్ హివాసే అధ్వర్యంలో ఆల్-వుమెన్ ఃఖీూ బృందం నిర్మించారు. ఈ రహదారి పేరు అత్యంత ఎత్తైన రహదారిగా గిన్నిస్ బుక్‌లో కూడా నమోదైంది. ఇప్పుడు 19400 అడుగుల ఎత్తులో నిర్మించిన లికారు-మిగ్ లా-ఫుక్చే రహదారి దాని రికార్డును బద్దలు కొట్టనుంది. లడఖ్‌లోని డెమ్‌చోక్ సెక్టార్‌లో కొత్త రహదారిని నిర్మిస్తున్నారు. ఆల్-వుమెన్ ఃఖీూ బృందం ఆధ్వర్యంలో ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. లిక్రు-మిగ్ లా-ఫుక్చే అని పిలువబడే ఈ రహదారి వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనది. ఇది 19400 అడుగుల ఎత్తులో ఉన్న ప్రదేశం గుండా వెళు

02

## కార్డులు కాదు...అంతా డిజిటలే

విజయవాడ, ఆగస్టు 22:




ఏపీ రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై లైసెన్స్, ఆర్సీ కార్డులు కార్డులు జారీ చేయమని తెలిపింది. వాహన తనిఖీ సమయాల్లో డిజిటల్ పత్రాలు చూపిస్తే సరిపోతుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఇకపై డ్రైవింగ్ లైలెన్సులు, ఆర్టీసీ కార్డులు ఉండవు. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రవాణాశాఖకు సంబంధించిన యాప్ లో పత్రాలు డౌన్ లోడ్ చేసుకుంటే సరి పోతుందని, ఇకపై కార్డులు జారీచేయమని ఈ శాఖ కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకూ లైసెన్సులు, ఆర్సీలను కార్డుల రూపంలో ఇస్తుంది రవాణా శాఖ ఇందుకోసం పోస్టల్ సర్వీస్ తో కలిసి రూ.225 వసూలు చేసేది. అయితే ఇప్పుడు ఈ ఛార్జీలు వసూలు చేయడంలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే డబ్బులు చెల్లించిన వారికి త్వరలో కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం "వాహన్ పరివార్" పేరు సేవలన్నీ ఆన్‌లైన్ చేసింది. దీంతో చాలా రాష్ట్రాలు కార్డులను తొలగించి డిజిటల్ రూపంలోనే పత్రాలు జారీ చేస్తున్నాయి. ఈ విధానాన్నే ఏపీ రవాణాశాఖ కూడా అమల్లోకి తెచ్చింది. రవాణాశాఖ వెబ్‌సైట్ లోని ఫారం 6 లేదా 23ని డౌన్‌లోడ్ చేసుకొని సర్టిఫికెట్ ను తీసుకోవాలి. లేదా "జీజూతీబిజీఇతిబితిళివని" ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

02

# ఇస్రో చారిత్రాక ఘట్టానికి గంటల సమయం

(మొదటిపేజీ తరువాయి)

లూనార్ క్రస్ట్, మాంటిల్ నిర్మాణాలను పరిశీలిస్తుంది. సౌరశక్తితో నడిచే ల్యాండర్, రోవర్ చంద్రుని పరిసరాలనను అధ్యయనం చేయడానికి సుమారు 2 వారాల సమయం పడుతుంది. రోవర్ కేవలం ల్యాండర్ తో మాత్రమే కమ్యూనికేట్ చేస్తుంది. ల్యాండర్ భూమిపై ఉన్న శాస్త్రవేత్తలతో కనెక్షన్ కలిగి ఉంటుంది. చంద్రయాన్-2 ఆర్బిటర్ ను కంటింజెన్సీ కమ్యూనికేషన్ రిలేగా కూడా ఉపయోగించవచ్చని ఇస్రో తెలిపింది. సోమవారం, చంద్రయాన్-2 ఆర్బిటర్ ల్యాండర్ మాడ్యూల్ తో కమ్యూనికేషన్ ను ఏర్పాటు చేసింది. 14 రోజుల్లో రోవర్ ఎంత దూరం ప్రయాణిస్తుంది అనేది చెప్పలేమని ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తెలిపారు. రోవర్ ప్రయాణం వివిధ అంశాలపై(కాలుక్యులేషన్స్) ఆధారపడి ఉంటుందన్నారు. దక్షిణ ధ్రువంలో రాత్రి ఉష్ణోగ్రత ఏకంగా మైనస్ 238 డిగ్రీల సెల్సియస్ కు పడిపోతుంది. ల్యాండర్, రోవర్ రెండో రోజు కూడా పని చేయాలంటే.. ఈ గడ్డకట్టే అత్యంత చలి ఉష్ణోగ్రతను తట్టుకోవాలి. ల్యాండర్, రోవర్ రెండూ చంద్రుడిపై రెండో రోజు కూడా పని చేసే అవకాశం ఉందని ఇస్రో చైర్మన్ తెలిపారు.=

## చంద్రయాన్ లైవ్ కోసం ఏర్పాట్లు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మక చంద్రయాన్ -3 సేఫ్ ల్యాండింగ్ కు అంతా సిద్ధమైంది. బుధవారం సాయంత్రం జరిగే సేఫ్ ల్యాండింగ్ కోసం భారత్ మాత్రమే కాదు ప్రపంచ దేశాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ఇలాంటి అపూర్వ ఘట్టం నేపథ్యంలో తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఈ చారిత్రక ఘట్టాన్ని స్టూడెంట్స్ లైవ్ లో చూసేలా విద్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఈ మేరకు డీఈవోలు, ప్రిన్సిపల్స్ కు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.ఆగస్టు 23న సాయంత్రం 5.30 సమయంలో చంద్రయాన్ -3 సేఫ్ ల్యాండింగ్ కానున్నట్లు ఇస్రో ప్రకటించింది. దీన్ని తెలంగాణ విద్యా ఛానెల్స్ అయిన టీశాట్, నిపుణ లో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. ఈ ఛానెల్స్ ను ఆయా ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక్ తెరలు, ప్రొజెక్టార్లు ఏర్పాటు చేసి టెలికాస్ట్ చేయనున్నారు. పాఠశాల ముగిసిన విద్యార్థులు ఒకచోట చేరి ఈ లైవ్ వీడియోని వీక్షించేలా విజ్ఞప్తి చేయనున్నారు.దేశంలోని విద్యార్థులు, యువత అంతా చంద్రయాన్-3 సేఫ్ ల్యాండింగ్ ను ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూడాలని ఇస్రో కోరింది. భారత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన ఇది యువతకు స్ఫూర్తి నిచ్చేలా విజయవంతం అవుతుందని.. అందురూ అందుకోసం ప్రార్థించాలని విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే చంద్రయాన్-3 కీలక దశకు చేరుకోగా.. ల్యాండర్ మాడ్యుల్ చంద్రుడికి మరింత చేరువైంది. ల్యాండర్ తీసిన చంద్రుడి ఫోటోలను కూడా ఇస్రో రిలీజ్ చేసింది. జయహో భారత్.. జయహో ఇస్రో అంటూ యావత్ భారతావని చంద్రయాన్-3 సేఫ్ ల్యాండ్ అవ్వాలని కోరుకుంటోంది.

# లడాఖ్ ప్రాంతంలో ఎత్తైన ఫెన్సింగ్

(మొదటిపేజీ తరువాయి)

తుంది. ఇది అందుబాటులోకి వస్తే.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రహదారి అవుతుంది. ఈ రహదారి చైనా సరిహద్దులోని వాస్తవ నియంత్రణ రేఖకు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉండడం కూడా దీని వ్యూహాత్మక ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. బిఆర్ఓ మహిళా విభాగం ఈ రహదారి నిర్మాణాన్ని ప్రారంభించింది. కల్నల్ పొనుంగ్ డోమింగ్ ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. కల్నల్ డోమింగ్‌తో పాటు ఇతర మహిళా అధికారులు కూడా ఈ రహదారి పనుల్లో ఉత్సాహంగా నిమగ్నమై ఉన్నారు.

# యోగికి పాదాబివందనం తప్పేంటి

చెన్నై, ఆగస్టు 22

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ తాజాగా 'జైలర్' సినిమాతో భారీ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. అయితే జైలర్ రిలీజ్ కి ముందు రజనీకాంత్ హిమాలయాలకు వెళ్లారు. ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్న ఆయన ఈమధ్య యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను కలిశారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ యోగి ఆదిత్య నాథ్ ని చూడగానే వెంటనే ఆయన కాళ్లు మొక్కారు. దీంతో ఇది కాస్త వివాదాస్పదంగా మారింది.లక్నోలో సీఎం ఆదిత్యనాథ్ ఇంటి ముందు రజనీకాంత్ కారు దిగిన వెంటనే తనకు స్వాగతం పలకడానికి వచ్చిన యోగి ఆదిత్యనాథ్ కాళ్ళను తాకడానికి వంగడం, వెంటనే యోగి ఆదిత్యనాథ్ సైతం రజనీకాంత్ ని ఇలాంటివి వద్దని చెప్పేలోపే ఆయన పాదాలకు నమస్కారం చేయడం క్షణాల్లో జరిగిపోయింది. దీంతో అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా అంతటా ఓ రేంజ్ లో వైరల్ అయ్యాయి. అంతే అప్పటినుంచి రజనీకాంత్ పై విపరీతమైన ట్రోలింగ్ జరిగింది.తనకంటే వయసులో చిన్నవాడైన సీఎం యోగి కాళ్ళను రజనీకాంత్ మొక్కడం ఏంటని సోషల్ మీడియాలో ట్రోలర్స్ నానా హంగామా చేశారు. మరోవైపు రజనీకాంత్ చేసిన ఈ పని ఆయన అభిమానులకు కూడా ఆగ్రహం తెప్పించింది. వయసులో పెద్ద, అలాగే ఒక సూపర్ స్టార్ అయి ఉండి ఒక రాజకీయ నాయకుడు, పైగా వయసులో తనకంటే 20 ఏళ్లు చిన్నవాడి కాళ్ళు మొక్కడాన్ని ఫ్యాన్స్ ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. మరోవైపు రాజకీయపరంగా కూడా దీనిపై ఎన్నో రకాల విమర్శలను లేవనెత్తారు. ఇంత జరుగుతున్నా ఇప్పటివరకు ఈ విషయంపై రజనీకాంత్ స్పందించనే లేదు.

అయితే తాజాగా తన ఆధ్యాత్మిక ట్రిప్ ముగించుకొని నేడు చెన్నై ఎయిర్ పోర్ట్ లో రజనీకాంత్ అడుగు పెట్టడమే ఆలస్యం ఇదే ప్రశ్నతో రిపోర్టర్లు తెగ రచ్చ చేశారు. దీంతో రజనీకాంత్ దీనిపై మీడియా ముందు స్పందించారు. "ఎవరైనా నాకంటే చిన్నవారైనా వారు యోగి లేదా స్వామిజీ అయినా వారి కాళ్లపై పడి ఆశీర్వాదం పొందడం నా పద్ధతి" అంటూ తనదైన శైలిలో ఒక్క మాటతో తేల్చేశారు సూపర్ స్టార్. ఇక ఆయన మాటలతో ఆ విమర్శలన్నీ ఒక్కసారిగా పటా పంచలు అయిపోయాయి. ఇక రజిని మాటలు విన్న పలువురు ఫ్యాన్స్ ఆయన చెప్పిన దాంట్లో తప్పేముంది, వయసులో చిన్న వాళ్ళయినా పెద్దవాళ్ళైనా స్వామీజీ, యోగులు కనబడితే ఎవరైనా కాళ్ళు మొక్కుతారు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే రజనీకాంత్ నటించిన 'జైలర్' ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్స్ తో దూసుకుపోతోంది. దర్శకుడు నెల్సన్ సినిమాలో రజనీకాంత్ ని చూపించిన విధానం, అలాగే సూపర్ స్టార్ యాక్షన్,, స్టైల్ ఫ్యాన్స్ కి విపరీతంగా నచ్చేసింది. చాలాకాలం తర్వాత వింటేజ్ రజిని చూసి ఫాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు. దీంతో జైలర్ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. కేవలం పది రోజుల్లోనే రూ.500 కోట్ల క్లబ్ లో చేరి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. '2.ఓ', 'పొన్ని యన్ సెల్వన్' సినిమాల తర్వాత రూ.500 కోట్లు కలెక్ట్ చేసిన మూడో తమిళ చిత్రంగా 'జైలర్' నిలిచింది.

# కేసీఆర్ లెక్క ఏంటీ... దానికి లక్కేంటి

(మొదటిపేజీ తరువాయి)

దాదాపుగా సిట్టింగులకే సీట్లు వచ్చాయి. 7 స్థానాల్లో మాత్రమే సిట్టింగులకు సీట్లు దక్కలేదు. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వాళ్లలో ఒకరికి మినహా అందరికీ సీట్లు దక్కాయి. ముందుగానే అభ్యర్థులను ప్రకటించడం పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే కిందటి ఎన్నికల్లో కూడా ఆయన ఇలాగే చేశారు. మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లోనూ అభ్యర్థులను ముందే ప్రకటిస్తామని చెప్పారు. దీని కంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగించిన విషయం మాత్రం కేసీఆర్ ఎందుకు రెండు చోట్ల పోటీ చేస్తున్నారు అన్నదే. ఏడు సార్లు పోటీ చేసి ఆరు సార్లు గెలుపొందిన సిద్దిపేట్ సీటును వదిలి.. గడచిన రెండుసార్లుగా గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సారి గజ్వేల్‌తో పాటు కామారెడ్డి లో పోటీ చేస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. కేసీఆర్ ఆలోచనలపై ప్రతిపక్షాలకు ముందే సమాచారం అందినట్లుంది. అందుకే రఘునందనరావు లాంటి బీజేపీ నేతలు కేసీఆర్‌కు ధైర్యం ఉంటే గజ్వేల్ లో మళ్లీ పోటీ చేయాలని సవాలు విసిరారు. తెలంగాణలో అత్యంత శక్తివంతమైన నేతగా.. తెలంగాణ రాష్ట్ర సాధకుడుగా పేరున్న కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేని పరిస్థితి ఉంటుందా.. ? కానీ బీజేపీ సవాళు .... దానిని బలపరుస్తూ కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేయడం అన్నది అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై కేసీఆర్ ఆన్సర్ ఇచ్చారు. కనీసం 105 మందిని గెలిపించే ఉద్దేశ్యంతోనే ఇంకో చోట పోటీ చేస్తున్నట్లు కేసీఆర్ చెప్పారు. దీనిపై చాలా కాలంగా వ్యూహం నడుస్తున్నట్లు ఉంది.

కామారెడ్డి నుంచి పోటీ చేయాలన్న కేసీఆర్ ఆలోచనలకు అనుగునంగానే అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తన స్థానంలో కేసీఆర్‌ను పోటీ చేయమని అడుగుతున్నారు . కామారెడ్డి జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వస్తుంది. కాంగ్రెస్ తరపున షబ్బీర్ అలీ వంటి బలమైన అభ్యర్థే ఉన్నారు. కిందటి పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ దెబ్బతింది. స్వయంగా కేసీఆర్ కుమార్తె కవిత ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం అక్కడ క్యాడర్ ను యాక్టివేట్ చేసి.. తన కుమార్తెను మళ్లీ నిజామాబాద్ బరిలోకి దింపి? అక్కడ గెలిపించిన గౌరవాన్ని పొందాలని కేసీఆర్ కోరుకుంటున్నట్లుగా అర్థం అవుతోంది. అందుకే ఈ దఫా లిస్టులో కవిత పేరు కనిపించలేదు. అంటే ఆమెను పార్లమెంట్‌కే పంపించే యోచనలో ఉన్నట్లుగా అనుకోవచ్చు. కానీ కేసీఆర్ లాంటి నేత... రెండు చోట్ల బరిలోకి దిగడం.. అది కూడా ధైర్యముంటే గజ్వేల్ లో గెలవాలని బీజేపీ నేతలు సవాలు చేసిన తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం.. ఎలాంటి ఫలితాన్నిస్తుందనే చూడాలి. యుద్ధంలో.. తాము గెలుస్తున్నామన్న నమ్మకాన్ని ఎదుటి వారిలో క్రియేట్ చేయడం.. యుద్దతంత్రంగా పేర్కొంటారు.

గజ్వేల్ లో మాత్రమే కాదు.. ఇంకో చోట కూడా గెలిచి చూపిస్తామనికేసీఆర్ ప్రతిపక్షాలకు సవాల్ విసురుతున్నారా అని కూడా చూసుకోవచ్చు. కానీ ఓటమి భయంతోనకేసీఆర్ రెండో చోట పోటీకి వెళ్లారని రేపటి నుంచి కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తాయి. గజ్వేల్‌ను ఆనుకుని ఉన్న దుబ్బాక ఉపఎన్నికలో బీజేపీ గెలిచింది. సానుభూతి ఉన్నా.. కేసీఆర్ పక్క నియోజకవర్గం అయినా కూడా అక్కడ బీఆర్ఎస్‌కు గెలుపు సాధ్యపడలేదు. దీనిని బట్టే గజ్వేల్ ప్రాంతంలో కేసీఆర్‌పై వ్యతిరేకత ఉందని బీజేపీ ప్రచారం చేయడం మొదలుపెట్టింది. వాళ్ల ప్రచారానికి ఊతం ఇచ్చేలా ఆయన ఇప్పుడు ఇంకోచోట నుచి పోటీకి దిగారు. ఇది ఓటమి భయమా.. ఓటమిని చేధించే వ్యూహమా అన్నది తేలాల్సి ఉందిప్పుడు...ఇక కేసీఆర్ పోటీ సంగతి పక్కన పెడితే.. దాదాపుగా సిట్టింగులందరికీ టికెట్లు ఇవ్వడం సాహసమనే చెప్పాలి. చాలామంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందనే రిపోర్టులు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ నుంచి వచ్చిన 12 మందిలో 11మందికి.. టీడీపీ నుంచి వచ్చిన ఇద్దరికీ మళ్లీ టికెట్లు దక్కాయి. దీంతో అక్కడ టికెట్లపై ఆశలు పెట్టుకున్న స్థానిక నేతలు ఏం చేస్తారన్నది చూడాలి. తెలంగాణలో సీనియర్ నేత.. తెలుగుదేశం పార్టీలో ముఖ్యుడిగా ఉన్న ఒకప్పటి తన స్నేహితుడు తుమ్మల నాగేశ్వరరావుకు కేసీఆర్ టికెట్ నిరాకరించారు. మరో ముఖ్యమైన నేత పట్నం మహేందర్ రెడ్డికీ టికెట్ దొరకలేదు. వీళ్లిద్దరూ ఏం చేస్తారో చూడాల్సి ఉంది. ఇక ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో వామపక్షాల ప్రభావం ఉంటుంది. మొన్నటి మునుగోడు ఎన్నికల్లో కమ్యునిస్టులతో చెలిమి చేసిన కేసీఆర్ ఈసారి వాళ్లకి చెయ్యిచ్చారు. లెఫ్ట్ తో పొత్తు ఉంటుందని అనుకున్నా.. అది జరగేది కాదని ఇవాళ తేలిపోయింది. అయితే అన్ని స్థానాలకూ కాండిడేట్లను ప్రకిటించినా ఎంఐఎంతో కలిసి పనిచేస్తామని కేసీఆర్ క్లియర్ గా ముందే ప్రకటించేశారు. సో గ్రౌండ్ క్లియర్ చేసి కేసీఆర్ పోరు సిద్ధమైపోయారు. మందుగానే ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకునేశారు. మరి కేసీఆర్ వ్యూహం ఫలిస్తుందా.. ఇది వర్కవుట్ అయితే సౌతిండియాలో వరుసగా రెండు సార్లు అధికారాన్ని నిలుపుకుని మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన వ్యక్తిగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారు.

# స్పేస్ మాడ్యూల్ మాడ్యూల్‌లోని ఇంజిన్లు ఆఫ్ కాలేదు

మాస్కో, ఆగస్టు 22



రష్యా స్పేస్ మాడ్యూల్ లూనా-25 చంద్రుడిపై కూలిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రయోగం విఫలం కావడానికి గత కారణాలను రష్యా అంతరిక్ష సంస్థ రాస్‌కాస్మోస్ వెల్లడించింది. ఆ ఏజెన్సీ అధిపతి యూరి బోరిసోవ్ కొన్ని విషయాలను తెలిపారు. నిర్దేశిత సమయంలో ఆ మాడ్యూల్‌లోని ఇంజిన్లు ఆఫ్ కాలేదని అన్నారు. దాంతో ఆ లూనా-25 అనుకున్న కక్ష్యను దాటి మరో కక్ష్యలోకి వెళ్లినట్లు చెప్పారు. దురదృష్టవశాత్తు తాము అనుకున్నట్లు ఇంజిన్ షటౌడన్ కాలేదని, ముందుగా అనుకున్నట్లు 84 సెక్లనలో ఇంజిన్ ఆఫ్ కావాలని, కానీ ఆ ప్రక్రియ జరిగేందుకు 127 సెకన్లు పట్టిందని, దాంతో లూనా-25 కూలి పోవాల్సి వచ్చిందని బోరిసోవ్ తెలిపారు.ఇంజిన్లు అనుకున్న సమయానికి ఆఫ్ కాకపోవడం వల్లే లూనా-25 మిషన్ ఫెయిల్ అయినట్లు బోరిసోవ్ వెల్లడించారు. ఇదే ప్రధాన కారణమన్నారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రొపల్షన్ సిస్టమ్‌లో మిషన్ ఆపరేషన్ సరిగా జరగకపోవడం వల్ల .. లూనార్ ఆర్బిట్ నుంచి వ్యోమనౌక ముందుకు వెళ్లిందని, దాని వల్ల అది చంద్రుడిపై కూలిందని ఆయన తెలిపారు.మిషన్ విఫలమైనా, తమ స్పేస్ ఇంజినీర్లు విలువైన అనుభవాన్ని గ్రహించారన్నారు. ఈ మిషన్‌లో జరిగిన పొరపాట్లను అన్నింటినీ పరిగణలోకి తీసుకుంటామన్నారు. లూనా-26, 27, 28 మిషన్లు భవిష్యత్తులో సక్సెస్ అవుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. చంద్రుడిపై దక్షిణ ధ్రువం అత్యంత క్లిష్టమైంది. అక్కడి ప్రాంతం అంతా ఎగుడుదిగుడుగా ఉంటుంది. చాలా వరకు దేశాలు తమ ల్యాండర్లను చంద్రుడి ఈక్వేటర్ ప్రాంతంలో దించాయి.రష్యా స్పేస్ ఏజెన్సీకి చెందిన సీనియర్ శాస్త్రవేత్త, 90 ఏళ్ల మిఖైల్ మారోవ్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. ఆయన్ను ప్రస్తుతం క్రిమ్లిన్‌లో ఉన్న సెంట్రల్ క్లినికల్ హాస్పిటల్‌లో చేర్పించారు. లూనా-25 మిషన్ విఫలం కావడంతో ఆయన సడెన్‌గా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది.

# కార్డులు కాదు...అంతా డిజిటలే

(మొదటిపేజీ తరువాయి)

వాహన తనిఖీ సమయంలో పోలీసు, రవాణాశాఖ అధికారులకు ఈ పత్రాలు చూపిస్తే సరిపోతుంది. డిజిటల్ పత్రాలను అనుమతించాలని పోలీసు, రవాణా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కార్డులను నిలిపివేయాలని డిజిటల్‌గా మార్చాలని ఏపీ రవాణా శాఖ నిర్ణయించింది. సీఎం జగన్ ఆదేశాలతో పేపర్‌లెస్ ప్రక్రియలో భాగంగా రవాణాశాఖ డిపార్ట్‌మెంట్ పత్రాలను డిజిటల్ వెర్షన్‌తో భర్తీ చేయనుంది. కార్డుల దరఖాస్తు రుసుము రూ. 200, పోస్టల్ ఛార్జీలు రూ. 25 ఇకపై వసూలు చేయమని ప్రకటించింది. డిజిటల్ కార్డులు డిజిలాకర్ లేదా పరివాహన్ సేవ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయి. మొబైల్ ఫోన్లు ఉపయోగించని వారు డిజిటల్ కార్డులను ప్రింట్ అవుట్ తీసుకుని అందుబాటులో ఉంచుకోవచ్చని రవాణాశాఖ కమిషనర్ పేర్కొన్నారుఇకపై ఫిజికల్ డ్రైవింగ్ లైసెన్స్ ను క్యారీ చేయక్కర్లేదని, పేపర్ డ్రైవింగ్ లైసెన్స్ లు, పేపర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లకు ప్లాస్టిక్ కార్డులుండవని రవాణా శాఖ తెలిపింది. పేపర్ లెస్ డిజిటల్ డ్రైవింగ్ లైసెన్ లు, డిజిటల్ ఆర్సీ కార్డులను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. ఈ విధానానికి ఏపీ రవాణా శాఖ కూడా అనుమతితెలిపింది. డ్రైవింగ్ లైసెన్స్ లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కార్డులను ప్రింట్ చేసి జారీ చేసే పాత విధానానికి స్వస్తి పలికి డిజిటల్ కార్డుల జారీ విధానాన్ని అమలుచేస్తుంది. డిజిటలైజేషన్ లో భాగంగా ఏపీ రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఆ కార్డుల కొరతతో ఏడాదిగా పెండింగ్ లో ఉన్న 25 లక్షలకు పైగా డ్రైవింగ్ లైసెన్స్ లు, ఆర్సీ కార్డుల ప్రింటింగ్ కు ప్రభుత్వం ఇటీవల రూ.33.39 కోట్లు మంజూరు చేసింది.

ఏపీలో వాహనదారులకు ఇకపై రవాణా శాఖ జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీలు కార్డు రూపంలో ఉండవు. సంబంధిత యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న డాక్యుమెంట్లు సరిపోతాయి. ఈ మేరకు రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ) కార్డుల జారీని ప్రభుత్వం నిలిపివేసింది. ఇకపై డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం చెల్లించాల్సిన ఛార్జీలను కూడా ఆపేసింది. లైసెన్సులు, ఆర్సీలకు ఇప్పటి వరకు కార్డుకు రూ.200, పోస్టల్ సర్వీస్‌కు రూ.25 మొత్తం రూ.225 చలానాతో కలిపి వసూలు చేసేవారు. ఇప్పుడు ఆ ఛార్జీలను కూడా వసూలు చేయడం లేదు. ఇకపై వాహనదారులు తమ మొబైల్స్‌లోనే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీని పోలీసులు, రవాణాశాఖ అధికారులకు చూపిస్తే సరిపోతుందని ప్రకటించింది. ప్రస్తుతమంతా డిజిటల్ యుగం నడుస్తోంది. లావాదేవీలతో పాటు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని.. అందుకే భారత ప్రభుత్వం కూడా డిజిటల్ ఇండియా ప్రాజెక్టును ప్రకటించింది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం దీనిని అమల్లోకి తీసుకువచ్చిందని ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పుకొచ్చారు. వాహనదారులంతా మొబైల్‌లో ఏపీఆర్టీఏ సిటిజన్ యాప్ ద్వారా లైసెన్స్, ఆర్సీలను డౌన్‌లోడ్ చేసుకోని పెట్టుకొని అవసరమైనపుడు చూపిస్తే సరిపోతుందని ప్రకటించారు. అయితే, ఈ డిజిటలైజ్ చేయడం వెనక పెద్ద తతంగమే నడిచిందని ఇప్పుడు ప్రభుత్వ వర్గాల నుండి లీకైన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. నిజానికి ఏపీ ప్రభుత్వం ఆర్టీఏ సర్వీసుల డిజిటలైజేష్ ప్రజలకు వెసులుబాటు కోసం చేసింది కాదనీ, లైసెన్సులు, ఆర్సీలకు కావాల్సిన ముడి సరుకు కొరతతోనే ఇందుకు ఉపక్రమించిందని అంటున్నారు. మొన్నటి వరకు లైసెన్సులు, ఆర్సీల కోసం వాహనదారుల నుండి కార్డుకు రూ.200, పోస్టల్ సర్వీస్‌కు రూ.25 మొత్తం రూ.225 చలానాతో కలిపి వసూలు చేసేవారు. ఇలా ఏడాది కాలంగా డబ్బులు చెల్లించిన ఎవరికీ ఈ కార్డులు పంపించలేదు. గత ఏడాది కాలంగా డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీలు కార్డు రూపంలో పంపిణీ చేయడానికి వాహనదారుల నుండి డబ్బులు తీసుకున్నారు కానీ, ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో డబ్బులు కట్టకపోవడంతో కార్డులు పంపాల్సిన వెండర్లు రవాణాశాఖకు పంపించలేదు. అప్పటికే పెండింగ్ బిల్లులు ఉండగా.. అవి క్లియర్ చేస్తేనే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో ప్రభుత్వం ఈ డిజిటల్ ఆలోచన చేసిందని చెబుతున్నారు. ఇకపై ఈ కార్డుల కోసం చెల్లించాల్సిన రూ.225 అవసరం లేదని చెప్తున్న రవాణా శాఖ.. గత ఏడాది కాలంగా ఈ డబ్బు చెల్లించిన వారికి కార్డులు పంపిస్తామని, అందుకు కొంత సమయం పడుతుందని చెప్తున్నారు. అయితే, ఇక కార్డుల ఆశ వదులుకోవాల్సిందేనని ఆర్టీఏ ఏజెంట్లు చెప్తున్నారు.

# తెలుగు ప్రజలను అలర్ట్ చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్, ఆగస్టు 22

తెలంగాణకు వాతావరణ శాఖ మళ్లీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. రానున్న మూడు రోజులు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఈ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకూ బలమైన గాలులు వీసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం తెలంగాణలోని ములుగు, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.ఇక హైదరాబాద్, జనగాం, మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, భువనగిరి జిల్లాలకు వర్షసూచన. మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ పది జిల్లాలకు అధికారులు ఎల్లో, గ్రీన్ అలర్ట్‌ను జారీ చేశారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో ఇప్పటికే వర్షం ప్రారంభమైంది. ఉదయం నుంచి పలు చోట్ల తేలికపాటి వర్షం కురుస్తోంది.

# టీటీడీ, అటవీ శాఖలకు పెద్ద టాస్క్

**తిరుపతి, ఆగస్టు 22:**

శేషాచలం అభయారణ్యంలోని క్రూరమృగాల బెడద ఇప్పుడు టిటిడికి పెద్ద టాస్క్ లా మారింది. నడక మార్గంలో చిన్నారులపై చిరుతల దాడితో కలవరపడుతున్న టిటిడికి ఇప్పుడు ఎలుగు బంటి వ్యవహారం మరో చాలెంజ్‌గా మారింది. మూడు చిరుతలను బంధించిన టిటిడి, అటవీ శాఖ లకు చిరుతల సమస్యే కాదు, ఎలుగు బంటి సంచారం కూడా చిరాకు పుట్టిస్తోంది. శ్రీవారి మెట్టు మార్గంలో ఎలుగుబంటి బందించేందుకు ఎక్స్‌పర్ట్స్ టీమ్‌ను టిటిడి రంగంలోకి దింపింది.శ్రీవారి దర్శనానికి నడక మార్గంలో కొండకు చేరే భక్తులకు భద్రతపై భరోసా ఇచ్చేందుకు టీటీడీ ఎన్నో అవస్థలు పడుతోంది. అలిపిరి నడక మార్గంలో ఇటీవల చిన్నారులపై జరిగిన చిరుత దాడులు తీవ్ర కలకలం సృష్టించగా.. టిటిడి శేషాచలం అభయారణ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏడుకొండలతో కూడిన శేషాచలం అడవులను ఎస్వీ అభయారణ్యంగా ప్రభుత్వం పాతికేళ్ళ క్రితమే ప్రకటించింది. 1998లో ఉమ్మడి చిత్తూరు కడప జిల్లాల పరిధిలోని శేషాచలం అడవులను ఎస్వి అభయారణ్యంగా ప్రకటించగా ఎన్నో వృక్ష జంతు జాతులకు నిలయంగా ఈ అటవీ ప్రాంతం ఉండి పోయింది. 67,541.31 హెక్టార్ల విస్తీర్ణంలోని శేషాచలం అడవుల్లో 52,597 హెక్టార్లు నోటిఫికేషన్ ప్రకారం శ్రీ వెంకటేశ్వర అభయారణ్యం పరిధిలో ఉంది. అభయారణ్యం పరిధిలోనే చిరుతలతో పాటు ఎలుగు బంట్లు, ఏనుగులు, అడవి కుక్కలు, అడవి పందులు, ముళ్ళ పందులు, నక్కలు, అడవి పిల్లులు, జింకలు, దుప్పిలు, కణతులతోపాటు ఎన్నో జీవరాసులు ఉన్నాయి.బయోస్పియర్ రిజర్వ్ ఫారెస్ట్ గా కూడా ప్రకటించిన శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తరచూ బయటికి వస్తున్న క్రూర మృగాలు ఇప్పుడు నడక మార్గంలో శ్రీవారి భక్తులను హడలెత్తిస్తుండగా మ్యాన్ ఈటర్ గా మారిపోతున్నాయి. దీంతో క్రూర మృగాల నుంచి భక్తులను కాపాడేందుకు టీటీడీ, అటవీ శాఖలు ఆపరేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా 50 రోజుల్లోనే మూడు చిరుతలను బంధించి రెండు ఎస్వీ జూ కు, మరొక చిరుతను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టిన అటవీ శాఖ ఇప్పుడు మరిన్ని చిరుతల వేటను కొనసాగిస్తోంది.చిరుతల సమస్య ఒక్కటే కాకుండా శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుల కంటపడిన ఎలుగుబంటి ఇప్పుడు అంతటా సంచరిస్తోంది. అలిపిరి నడకమార్గం వరకు అలజడి చేస్తుంది. దీంతో ఎలుగుబంటిని బంధించేందుకు టీటీడీ ఎన్నో ప్రయత్నాలు చేపట్టింది. కెమెరా ట్రాప్ లను ఏర్పాటు చేసి ఎలుగుబంటిని గుర్తించే పనిలో పడింది. ఎలుగుబంటిని బోన్లో బంధించేందుకు అవకాశం లేకపోవడంతో వల పన్ని పట్టుకునే పనిలో టీటీడీ 100 మందిని సిబ్బంది అహర్నిశలు పనిచేసేలా చర్యలు చేపట్టింది. ఎక్స్‌పర్ట్ టీమ్‌ను రంగంలోకి దింపింది. మరోవైపు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తోంది.ఇక శేషాచలం అడవుల్లో చిరుతలను, ఎలుగు బంట్లను గుర్తించి బంధించేందుకు ఏకంగా 500 కెమెరా ట్రాప్ లు ఏర్పాటు చేసింది. అయితే ఎలుగు బంటి జాడ తెలిసినా బంధించడంలో సక్సెస్ కాలేకపోయిన టీటీడీ, ఫారెస్ట్ సిబ్బందికి ఎలుగుబంటి ఆపరేషన్ టాస్క్ లా మారిపోయింది.

## కర్నూలు జిల్లాల్లోనూ ఆనవాళ్లు

రాష్ట్రానికి చెందిన నంద్యాల జిల్లా రుద్రవరం మండలం పెద్ద కంబలూరు సమీపంలో రెండు చిరుతపులుల సంచారం చేస్తున్నాయి. దీంతో భయాందోళనలకు గురైన రైతులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సమాచారం అందించినా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు. పైగా అటవీ ప్రాంతంలో చిరుతపులలో వస్తూపోతూ ఉంటాయని అడవి శాఖ అధికారులు నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపంలో రెండు చిరుత పులులు సంచరిస్తున్న నేపథ్యంలో రైతులు ఆవేదన ఇదీ..

నంద్యాల జిల్లా, రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపంలో రెండు చిరుత పులులు సంచరిస్తూ ఉండడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల క్రితం శ్రీరంగాపురం గ్రామ సమీపంలో చిరుత పులి సంచరించినప్పటికీ ఫారెస్ట్ అధికారులు చిరుత పులిని అడవిలోకి తిరిగి పంపించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరికొన్ని చిరుతపులులు అటవీ సమీప గ్రామాలైన పెద్ద కంబలూరు సమీపంలోని పంట పొలాల్లో సంచరిస్తూ రైతులను గడగడలాడిస్తున్నాయి. చిరుత పులుల సంచారం గురించి రైతులు ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినప్పటికీ వారు అటవీ సమీపంలో చిరుత పులులు వస్తూపోతూ ఉంటాయని అంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదని నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం తిరుమల అడవుల్లో ఓ బాలికపై చిరుత దాడి చేసి చంపడంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు చిరుతల సంచారం అంటేనే భయాందోళన చెందుతున్నారు. అటవీ సమీపాన వందల ఎకరాల్లో మినుము, మొక్కజొన్న ,వరి తదితర పంటలు రైతులు సాగు చేశారు. ప్రస్తుతము తెలుగు గంగ కాలువ ద్వారా నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు పంటలకు నీరు పెట్టుకునేందుకు వెళ్ళటానికి భయాందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో సంచరిస్తున్న చిరుత పులులను అడవుల్లోకి వెళ్లేలా ఫారెస్ట్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చిరుత పులులు సంచరిస్తున్నాయని సమాచారం అందించినప్పటికీ స్పందించని ఫారెస్ట్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.

# సెప్టెంబర్, అక్టోబరులలో బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 22:**

పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవుడిని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. స్వామివారి ఆజ్ఞ ప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనంద నిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యామాసం(ఆశ్వయుజం)లోని శ్రవణా నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించారట. అందువల్లే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటినుండి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడో ఏటా అధికమాసం వస్తూ ఉంటుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్ద తేడా లేదుగానీ, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది అధికమాసం ఉన్న కారణంగా సెప్టెంబరు 18 నుండి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుండి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబరు 18న ధ్వజారోహణం, సెప్టెంబరు 22న గరుడ వాహనం, సెప్టెంబరు 23న స్వర్ణరథం, సెప్టెంబరు 25న రథోత్సవం(మహారథం), సెప్టెంబరు 26న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగనున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా అక్టోబరు 19న గరుడవాహనం, అక్టోబరు 22న స్వర్ణరథం, అక్టోబరు 23న చక్రస్నానం జరుగనున్నాయి.. బ్రహ్మోత్సవాల కారణంగా సెప్టెంబరు 18 నుండి 26వ తేదీ వరకు, అక్టోబరు 15 నుండి 23వ తేదీ వరకు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ముందస్తుగా ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను నిర్దేశిత వాహనసేవకు మాత్రమే అనుమతిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల అంకురార్పణ కారణంగా అక్టోబరు 14న సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

# రికార్డుల మోత మోయిస్తున్న జెన్ కో

**విజయవాడ, ఆగస్టు 22:**

ఏపీజెన్‌కో విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం విద్యుత్ ఉత్పత్తిలో సంస్థ ఘననీయమైన ప్రగతి సాధించినట్లు అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదక సంస్థ (ఏపీజెన్‌కో) విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోంది. గత నెలలో సీలేరు బేసిన్ జలవిద్యుత్ కేంద్రాలు గరిష్ట విద్యుత్ ఉత్పత్తి నమోదు చేయగా? ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగున్నర నెలల్లో థర్మల్ యూనిట్లు అద్భుత పనితీరు ప్రదర్శించింది. 2022? 23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 18వ తేదీ అర్ధరాత్రి వరకూ ఏపీజెన్‌కో థర్మల్ యూనిట్లు 10,108.196 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా ?ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 12,994.987 మిలియన్ యూనిట్లు సరఫరా చేయడం విశేషం.గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది కేవలం నాలుగున్నర నెలల స్వల్ప సమయంలో 2,886.791 మిలియన్ యూనిట్ల అధిక ఉత్పిత్తి చేయడం జెన్‌కో థర్మల్ యూనిట్ల ఉత్తమ పనితీరుకు నిదర్శనం. సమస్యలను అధిగమిస్తూ ఏపీ జెన్‌కో గరిష్ట స్థాయిలో రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడం ద్వారా పశంసలందుకుంటోంది. విద్యుత్ డిమాండు అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర అవసరాలను 45 నుంచి 50 శాతం వరకూ సొంతంగా తీర్చడానికి సంస్థ పోటీపడి నిర్విరామంగా పనిచేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆరిక్థ సంవత్సరం విద్యుత్ ఉత్పత్తిలో సంస్థ ఘననీయమైన ప్రగతి సాధించింది.ఏపీజెన్‌కో తన అనుబంధ సంస్థ ఏపీపీడీసీఎల్‌తో కలిపి మొత్తం మూడు ప్లాంట్లలో 5810 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఆగస్టు 18వ తేదీ వరకూ ఈ కేంద్రాలు మొత్తం సగటున 51.84 పీఎల్ఎఫ్ సాధించగా ఈ సంవత్సరం ఇదే కాలంలో ఇది 66.61 శాతానికి పెరగడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది ఇదే కాలంలో రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు (ఆర్టీపీపీ) పీఎల్ఎఫ్ 64.10 నుంచి 72.43 శాతానికి పెరిగింది. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్) పీఎల్ఎఫ్ 73.59 నుంచి 78.38 శాతానికి చేరింది. దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం పీఎల్ఎఫ్ 27.46 శాతం నుంచి 53.98 శాతానికి పెరిగింది.థర్మల్ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి సిబ్బంది, అధికారులు చేస్తున్న కృషిని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుంటూ మరింత అంకిత భావంతో పనిచేస్తూ ఏపీజెన్‌కోను అన్ని విధాలా దేశంలోనే అగ్రగామిగా నిలపాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి ఎక్కువ పరిమాణంలో బొగ్గు కేటాయించేలా ముఖ్యమంత్రి జగన్ కేంద్ర ప్రభుత్వంలో మాట్లాడి ఒప్పించారని, అందువల్లే అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయగలిగామంటూ వారికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# మార్కెట్లో రాక్షస పుట్టగొడుగు...

**ఏలూరు, ఆగస్టు 22:**

వర్షాకాలం రాగానే అక్కడక్కడ మనకు పుట్టగొడుగులు దర్శనమిస్తాయి. చూడడానికి తెల్లగా, మెరుస్తూ అందంగా ఉంటాయి. పుట్టగొడుగులు తినడం ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇలాంటి పుట్టగొడుగుల్లో కొన్ని విషపూరతమైనవి కూడా ఉంటాయట. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఒక భారీ పుట్టగొడుగు అందరిని ఆకర్షిస్తుంది. మెంటేవారి తోటలో నివాసముంటున్న మహమ్మద్ సరోజినీ తమ కుటుంబంతో కలిసి వారి స్థలంలోనికి నడుచుకుంటూ వెళ్తున్నారు. వారి స్థలంలో రోడ్డు పక్కన మెరుస్తూ తెల్లగా కనిపిస్తుండడంతో అక్కడికి వెళ్లి చూశారు.అది ఒక పెద్ద పుట్టగొడుగు. సుమారు రెండు కేజీలు ఉన్న పుట్టగొడుగులు చూసి వారంతా ఆశ్చర్యపోయారు. ఆ పుట్టగొడుగును తీసుకుని రైతు బజార్ లోనికి వెళ్లారు. అక్కడి వ్యాపారస్తులు ఆ పుట్టగొడుగులు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద పుట్టగొడుగు ఎప్పుడు మార్కెట్ కి రాలేదని దీని విలువ 700 నుండి 900 రూపాయలు వరకు ఉంటుందని వ్యాపారస్తులు వారితో చెప్పారు.ఆ పుట్టగొడుగును అక్కడనుండి ఇంటికి తీసుకు వచ్చేసారు మహమ్మద్ సరోజిని. ఇంత భారీ సైజులో ఏర్పడిన పుట్టగొడుగును ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. పుట్టగొడుగులు సాధారణంగా 100 గ్రాములు వరకు ఉంటాయని, భారీగా పెరిగిన వాటిలో విష పదార్థాలు ఉంటాయని అంటున్నారు పశ్చిమగోదావరి జిల్లా ఉండి లోని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మల్లికార్జునరావు.భారీ సైజులో ఉన్న పుట్టగొడుగులను తినకూడదని సూచిస్తున్నారు. పుట్టగొడుగులు ఆరోగ్యానికి మంచిదని ప్రోటీన్స్ ఎక్కువగా ఉండి, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయని అంటున్నారు. పుట్టగొడుగుల మీద అవగాహన లేకుండా తినడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని ఆయన చెప్పారుమనకు కనిపించే పుట్టగొడుగులు అన్నీ మంచివి కావు. ఇందులో 70 నుంచి 80 రకాల పుట్టగొడుగులు చాలా విషపూరితమైనవి. ఈ ప్రాణాంతకమైన శిలీంధ్రాలు ఉన్నాయి. చూడటానికి ఒకేలా ఉన్నా.. ఇందులో కొన్ని ప్రాణాలను తీసేవి కూడా ఉన్నాయి. బహుశా అన్ని పుట్టగొడుగులలో ప్రాణాంతకమైనవి అని చెప్పలేము. ఇలాంటి విషపూరితమైనవి ఐరోపా అంతటా కనిపిస్తాయి. తినదగిన గడ్డి పుట్టగొడుగులు, సీజర్ పుట్టగొడుగులను దగ్గరగా పోలి ఉంటాయి. వీటిని తింటే శరీరమంతా కణాలను త్వరగా దెబ్బతీస్తాయి. తిన్న తర్వాత 6 నుంచి 12 గంటలలోపు కడుపు నొప్పి, వాంతులు, రక్తపు విరేచనాలు అవుతాయి. దీని వలన కణజాలం నుంచి ద్రవం వేగంగా వ్యాప్తి చెందుతుంది. మష్రూమ్ టాక్సిన్స్ అనేది ఫంగస్ ద్వారా ఉత్పత్తి చేయబడిన ద్వితీయ జీవక్రియలు .చాలా మందికి మార్కెట్లో కనిపించే ప్రసిద్ధ బటన్ లేదా పోర్టోబెల్లో పుట్టగొడుగుల గురించి మాత్రమే తెలుసు. కానీ తినడానికి పనికొచ్చేవి అనేక రకాల పుట్టగొడుగులు ఉన్నాయి. వీటిలో మనం ముఖ్యంగా 20 రకాల పుట్టగొడుగుల తినేటివి ఉన్నాయి. ఇతర రకాలు మీ రోగనిరోధక శక్తిని పెంచడానికి, తక్కువ రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను పెంచడానికి వాటి ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చు. క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధుల చికిత్సకు కూడా ఉపయోగపడతాయి. పుట్టగొడుగులు 90 శాతం నీటితో తయారవుతాయి. పుట్టగొడుగు అనేది ఒక శిలీంధ్రం.. కండగల, బీజాంశం-బేరింగ్ ఫలాలు కాస్తాయి. ఇది నేలపై లేదా దాని ఆహార వనరుపై పెరుగుతుంది. పుట్టగొడుగులను ఇప్పుడు అనేక వంటకాల్లో.. ముఖ్యంగా చైనీస్, కొరియన్, యూరోపియన్, జపనీస్ వంటలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అనేక రకాల పుట్టగొడుగులతో రుచికరమైన వంటకాలు చేయవచ్చు. మార్కెట్లో అందుబాటులో ఉన్న విభిన్న రకాలతో చాలా రకాల వంటలను సిద్ధం చేస్తారు. పుట్టగొడుగులు వాటి జనాదరణకు కేవలం వాటి ఆహ్లాదకరమైన రుచి మాత్రమే కాకుండా వాటిలో లభించే పోషకాహార ప్రొఫైల్‌పై ఆదారపడి ఉంటాయి. అన్ని తినదగిన పుట్టగొడుగులు మీకు అవసరమైన పోషకాలను అందిస్తాయి.

# పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**శ్రీకాకుళం**

హరితవనంగా ఆర్ట్స్ కళాశాల లో పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని,వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజంలో నివసించే అందరి ఆరోగ్యం పరిరక్షించేందుకు వాకర్స్ సంస్థలు ప్రత్యేక చర్యలు తీసికుంటున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ పి.జి.గుప్తా అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పుట్టపర్తి సత్యసాయిబాబా సన్నిధానం నుంచి వొచ్చిన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత వనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణాన్ని తయారుచేయుటకు స్టార్ వాకర్స్ క్లబ్ ముందుకు రావటం ఎంతో అభినందనీయం అన్నారు.సత్యసాయిబాబా భక్తుడు జామి జనార్ధనరావు తీసికివొచ్చిన మేలుజాతి మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా వుందన్నారు.ప్రత్యక్ష దైవం గా భావించే బాబా సన్నిధానం నుండి శ్రీకాకుళం నగరానికి సుమారు 30వేల మొక్కలు వొచ్చాయని వీటిని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాటుతున్నామని సాయి సేవకులు నల్లబాటి కృష్ణమూర్తి, డాక్టర్ కె. పాండురంగారావు లు అన్నారు. నిస్వార్థ సామాజిక సేవలకు చిరునామాగా నిలుస్తున్న సత్యసాయి బాబా సన్నిధానం నుండి జిల్లాకు చేరుకున్న మొక్కలు జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ బాబా ఆలయాల ద్వారా భక్తులకు పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు ,బి.వి.రవిశంకర్, జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్,నాగేశ్వర ఈశ్వరరావు, గోలీ సంతోష్ ,ఉమా, మల్లిబాబు ,మోహన్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

# 36 వేల కోట్ల అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు

**ముంబై, ఆగస్టు 22 :**

దశాబ్దాల తరబడి బ్యాంకుల్లో మూలుగుతున్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వాటి హక్కుదార్లు అప్పగించడానికి ఒక సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్‌ను రిజర్వ్ బ్యాంక్ లాంచ్ చేసింది. బ్యాంకుల్లో డిపాజిట్ చేసి మరిచిపోయిన, కుటుంబ సభ్యులకు తెలీని పెట్టుబడుల గురించి ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. గతంలో, విడివిడిగా ఒక్కో బ్యాంక్ సైట్‌లోకి వెళ్లి సెర్చ్ చేయాల్సి వచ్చేది. పదుల సంఖ్యలో ఉన్న బ్యాంక్ సైట్లలోకి వెళ్లి సెర్చ్ చేయడం చాలా శ్రమతో పాటు కాలయాపనతో కూడిన పని. ఇప్పుడు, కొత్త పోర్టల్ ద్వారా ఒకేచోట ఆ వివరాలన్నీ తెలుస్తాయి.ఉద్గం పేరిట నాడు, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు ఈ పోర్టల్‌లో కనిపిస్తాయి. డిపాజిటర్ పేరు, ఊరు వంటి వివరాలతో సెర్చ్ చేస్తే, ఆ వ్యక్తికి ఏదైనా బ్యాంక్‌లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ ఉంటే తెలుస్తుంది. తద్వారా ఆ డిపాజిట్‌ను క్లెయిమ్ చేయడం సులభం అవుతుంది.ప్రస్తుతానికి, ఉద్గం పోర్టల్‌లో 7 బ్యాంకులు చేరాయి. అవి... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ధనలక్ష్మి బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సౌత్ ఇండియన్ బ్యాంక్, ఆబా బ్యాంక్ ఇండియా, సిటీ బ్యాంక్. ఈ 7 బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను ఉద్గం పోర్టల్‌లో చూడవచ్చు. మిగతా బ్యాంకులను కూడా ఈ పోర్టల్‌కు లింక్ చేసే ప్రాసెస్ జరుగుతోంది. ఈ ఏడాది అక్టోబరు 15 కల్లా, దశలవారీగా అన్ని బ్యాంకులను ఉద్గం పోర్టల్‌లో అందుబాటులోకి తెస్తామని రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది.10 సంవత్సరాలకు మించి, ఎవరూ క్లెయిమ్ చేసుకోకుండా బ్యాంకుల్లో ఉండిపోయిన డిపాజిట్లను అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పిలుస్తారు. బ్యాంక్ ఖాతాలు, పథకాల్లో డబ్బులు డిపాజిట్ చేసి మరిచిపోవడం, లేదా, డిపాజిట్ చేసిన వ్యక్తి హఠాత్తుగా మరణించడం వల్ల వాటి గురించి కుటుంబ సభ్యులకు తెలీకపోవడం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు కారణం.ఈ ఏడాది మార్చి 31 నాటికి, ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 36,185 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను 'డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్'కు బదిలీ చేశాయని కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రకటించింది. 2019 మార్చి 31 నాటికి ఈ మొత్తం రూ. 15,090 కోట్లు మాత్రమే. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లలో రూ. 8,086 కోట్లతో స్టేట్ బ్యాంక్ టాప్ ప్లేస్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ. 5,340 కోట్లు), కెనరా బ్యాంక్ (రూ. 4,558 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ. 3,904 కోట్లు) ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి, ప్రైవేట్ బ్యాంకులు రూ. 6,087 కోట్లను 'డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్' బదిలీ చేశాయి.దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు పెరుగుతుండడంతో, ఆ డబ్బులను సొంతదార్లకు అప్పగించడానికి కేంద్ర బ్యాంక్ చర్యలు తీసుకుంది. క్లెయిమ్ చేయని డిపాజిట్లను ట్రాక్ చేయడానికి సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్‌ను డెవలప్ చేస్తున్న ఈ ఏడాది ఏప్రిల్ 6న ప్రకటించింది.

# కారు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

**తిరుపతి**

నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారులు రోడ్డు ప్రమాదం జరిగింది. పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. రేణిగుంట వాసులు తంజావూరులో శుభకార్యం లో పాల్గొని తిరిగివస్తున్నారు. తిరుపతి బాలాజీ డైరీ సమీపంలో కారు అదుపుతప్పింది. డ్రైవర్ నిద్ర పోవడంతో రోడ్డు దిగి పొలాల్లోకి దూసుకుపోయింది. ఘటనలో ఏడు మందికి గాయాలు అయ్యాయి. వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

## మంత్రి తలసాని నివాసం వద్ద కోలాహలం

**హైదరాబాద్**

మారెడ్ పల్లిలోని మంత్రి తలసాని నివాసం వద్ద కోలాహలం నెలకొంది. సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి తలసాని పేరు ఖరారు కావడంతో మంత్రికి శు భాకాంక్షలు తెలిపేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దల ఎత్తున చేరుకున్నారు. సనత్ నగర్ నియోజకవర్గం నుండే కాకుండా నగరం నలుమూలల నుండి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ కాలనీల అసోసియేషన్ ల ప్రతినిధులు వచ్చారు. డప్పు చప్పుళ్ళు, బాణసంచా కాల్చి, నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించారుర.

## ఖానాపూర్ ఎమ్మెల్యే బరిలో నేనే ఉంటా

**నిర్మల్**

బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ స్పష్టం చేసారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఏ పార్టీ నుండి పోటీలో ఉంటాననేది త్వరలో ప్రకటిస్తా. ఎమ్మెల్యే గా ఇంకా 49 రోజుల వరకు కూడా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతా. నేను పార్టీ మారానన్నది అవాస్తవం. నా భర్త మనో వెదనతోనే కాంగ్రెస్ లో చేరారు. ప్రతి రోజు ప్రజాల్లోనే ఉంటా ప్రజాలకోసమే పనిచేస్తానని అన్నారు. నా క్యాడర్ ఎటూ పోలేదు నా క్యాడర్ కోసమైనా పోటీలో ఉంటా. కార్యకర్తలు ఎవరు ఆందోళనకు గురి కావద్దు. ఖానాపూర్ ఎమ్మెల్యే గా పోటీ చేస్తా గెలిచి చూపిస్తానని రేఖానాయక్ అన్నారు.

## చంద్రబాబుపై జూపూడి విమర్శలుతగవు

**అనకాపల్లి**

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను తిడితే జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఇస్తాడని ఆశతో జూపూడి ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, స్టేట్ ఎస్సీ సెల్ నాయకుడు సబ్బవరపు గణేష్ విమర్శించారు. అనకాపల్లి విచ్చేసిన జూపూడి ప్రభాకర్ మీడియా సమావేశంలో టిడిపి జనసేన అధినేతల పై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్సీ జగదీష్ జగన్మోహన్ రెడ్డి దళితులకు సంబంధించిన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించారని దళితులకు మేనమామ గా ఉంటానని చెప్పి దళితుల అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. 2014లో టిడిపి నుండి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా ఉండి లబ్ధి పొందిన జూపూడి ప్రభాకర్ చంద్రబాబుపై విమర్శలు చేయడం తగదు అన్నారు. దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిన జగన్మోహన్ రెడ్డిని భుజానికి ఎత్తుకున్న జూపూడి ప్రభాకర్ దళిత ద్రోహి అని సబ్బవరపు గణేష్ విమర్శించారు.

# సంక్షేమానికే ప్రజల వోట్లు

**విజయవాడ**

ఎన్నికలు సమీపిస్తుండ టంతో పనిలేకపోయినా ఒక పుత్రుడు విజయవాడలో దత్తపుత్రుడు విశాఖ లో నడుస్తున్నాడనీ సెంట్రల్ ఎంఎల్ఏ మల్లాది విష్ణు అన్నారు. ముగ్గురు మూ డు చోట్ల నడుస్తూ జగన్ పై బురదజ చల్లాలని చూస్తున్నారనీ, పంచాయితీ ఎన్నిక లతో ఏపీ ఓటరు నాడి బట్టబయలైందనీ అన్నారు. ప్రజల ఓటు సంక్షేమానికే అని నిన్న స్పష్టంగా తెలిపారనీ అన్నా రు. టిడిపి కాలంలో రోడ్లను చేసారో, మా ప్రభుత్వంలో రోడ్లు ఎలా ఉన్నా యో బహిరంగ చర్చకు మేం సిద్ధమని, విజయవాడలో రవాణా రంగాన్ని భ్రష్టు పట్టించింది టిడిపి అని అన్నారు.

## పఠాన్ చేరులో ముదిరాజుల ధర్నా

**సంగారెడ్డి**

పఠాన్ చేరులో ముదిరాజులు ధర్నాకు దిగారు. తెలంగాణ రాష్ట్రంలో 60లక్షలకు పైగా ఓటర్లున్న ముదిరాజులకు ఒక్క ఎమ్మెల్యే సిటు కేటాయించక పోవడంతో కేసిఆర్ ముదిరాజులకు అన్యాయనీచేస్తూ మోసం చేశాడంటూ నినాదాలు చేసారు. ధర్నాచేస్తూ నిరసన తెలిపారు. పఠాన్ చేరు ఎమ్మెల్యే టికెట్ నీలం మధు ముదిరాజుకు కేటాయించి ముదిరాజులకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేసారు. కాకపోతే, రాష్ట్ర మొత్తంలో ఉన్న ముదిరాజులం ఎకమై అందోళనలు చేస్తామంటూ హెచ్చరించారు.

# మీర్ పేట్ లో ఉద్రిక్తత

**రంగారెడ్డి**

మీర్ పేట్ నందనవనం ప్రధాన రహదారిపై ఉద్రిక్తత నెలకొంది. మైనర్ బాలికపై రేప్ చేసిన నిందితుల్ని శిక్షించాలంటూ డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. నందనవనం లోని ఇందిరమ్మ ఇళ్లల్లో ఆసాంఘీక కార్యకలాపాలు కొనసాగుతున్నా యంటూ ఆందోళన చేసారు. మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేసారు. నందన వనం లో డ్రగ్స్, గంజాయి కి అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపించారు. రాజకీయ పార్టీలు, స్థానికులు కలిసి రోడ్డు పై బైఠాయించారు. ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు.

# విశాఖ, తిరుపతి మధ్య మరో వందే భారత్

**విశాఖపట్టణం, ఆగస్టు 22:**

ఏపీలో మరో వందే భారత్ రైలు పట్టాలెక్కే ఛాన్స్ కనిపిస్తుంది. విశాఖ-తిరుపతి మధ్య వందే భారత్ రైలు నడపనున్నాయని తెలుస్తోంది ఏపీలో మరో వందేభారత్ రైలు పరుగులు పెట్టనుందని వార్తలొస్తు?న్నాయి. విశాఖ-తిరుపతి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. నిన్న సాయంత్రం చెన్నై నుంచి 16 బోగీల వందే భారత్ రైలు విశాఖకు బయలుదేరింది. ఈ రైలు విశాఖ-తిరుపతి మధ్య నడుపుతారని ప్రచారం జరుగుతోంది. ఈ రైలు ఎక్కడి నుంచి ఎక్కడికి నడుపుతారో పూర్తి సమాచారం రాలేదు. కానీ తిరుపతి నుంచి విశాఖకు నడిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాల్తేరు రైల్వే అధికారులు స్పందిస్తూ.. వందేభారత్ రైలుపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. విశాఖ-సికింద్రాబాద్ మధ్య ఇప్పటికే వందే భారత్ ఎక్స్ ప్రెస్ నడుపుతున్నారు. ఈ రైలులో తరచూ సాంకేతిక సమస్యలను తలెత్తుతున్నాయి. రద్దైన సందర్భాలు కూడా ఉన్నాయి. తరచూ ఇలా జరుగుతుం డంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రయాణి కులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరిం చేందుకు మరో రైలును చెన్నై నుంచి రప్పిస్తున్నట్లు మరో వాదన వినిపిస్తోంది. కానీ ఎక్కువ శాతం మంది విశాఖ-తిరుపతి మధ్య వందే భారత్ రైలు నడుపుతారనే ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్-విశాఖ, సికింద్రాబాద్-తిరుపతి మధ్య ఈ రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నారు .హైదరాబాద్-బెంగళూరు మధ్య మూడో వందేభారత్ రైలు పరుగులు తిరగనుంది. విశాఖ-తిరుపతి మధ్య మరో వందే భారత్ రైలు వస్తే ఈ సంఖ్య నాలుగుకు చేరనుంది. ఇప్పటికే హైదరాబాద్-బెంగళూరు వందే భారత్ రైలు మార్గానికి సంబంధించి రూట్ మ్యాప్ ఖరారు అయింది. ట్రైల్ రన్ కూడా పూర్తైంది. ఆగస్టు 15న వందే భారత్ ఎక్స్ ప్రెస్ ప్రారంభించాల్సి ఉండగా వాయిదా పడింది. ఈ నెల 25న ఈ రైలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. కాచిగూడ-బెంగళూరులను కలిపే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 25 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ రైలుతో హైదరాబాద్-బెంగళూరు మధ్య కనెక్టివిటీని మెరుగుపడనుంది. ఈ రైలు కాచిగూడ నుంచి బెంగళూరులోని యశ్వంతపూర్ రైల్వేస్టేషన్ మధ్య నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ, యశ్వంత్‌పూర్ మార్గంలో ప్రయాణించే వందే భారత్ రైలు కర్నూలు మీదుగా ప్రయాణిస్తుంది. ముందుగా రాయచూర్ మార్గంలో నడపాలని అధికారులు భావించినా ప్రస్తుతం దానిని కర్నూలు మీదుగా నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

# గులాబీలో అసంతృప్తి జ్వాలలు

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

అధికార పార్టీ బీఆర్ఎస్ లో అసమ్మతి మొదలైంది. టికెట్ ఆశించి భంగపడిన నేతలు పార్టీలు మారేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఖానాపూర్ లో బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బ తగిలింది. సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖా నాయక్ బీఆర్ఎస్ వీడనున్నారు. తనకు టికెట్ కేటాయించకపోవడంతో అసంతృప్తికి లోనైన ఆయన అధికార పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రేఖా నాయక్ భర్త భర్త శ్యామ్ నాయక్ సోమవారం రాత్రి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీపీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి రేఖా నాయక్ భర్తను పార్టీకి ఆహ్వానించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ నేడు అసెంబ్లీ ఎన్నికలకు తొలి విడతగా 115 అభ్యర్థులతో బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అయితే ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టికెట్ ఇవ్వలేదు. ఖానాపూర్ నుంచి రెండుసార్లు బీఆర్ఎస్ తరపున విజయం సాధించిన రేఖానాయక్ కు ఈసారి కేసీఆర్ మొండిచేయి చూపారు. తనకు పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారు. బీఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆమె భర్త సోమవారం కాంగ్రెస్ లో చేరగా, త్వరలో ఎమ్మెల్యే రేఖా నాయకు హస్తం పార్టీలో చేరనున్నారని తెలుస్తోంది. ఖానాపూర్ నియోజకవర్గంలో కొంత కాలంగా పని చేసుకుంటున్న మంత్రి కేటీఆర్ స్నేహితుడు, ఎన్నారై జాన్సన్ నాయక్ కు బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. మరోవైపు రేఖా నాయక్ నిత్యం వివాదాలతో సావాసం చేస్తున్నారని.. తన వ్యవహారశైలితో సొంత పార్టీ నేతలనూ దూరం చేసుకున్నారని ప్రచారంలో ఉంది. ఈ ఎన్నికల్లో రేఖా నాయక్ కు టికెట్ ఇచ్చినా ఫలితం లేదని సీఎం కేసీఆర్ ఆమెకు టిక్కెట్ నిరాకరించిందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఖానాపూర్, ఆసిఫాబాద్, బోథ్, వేములవాడ, వైరా, మెట్ పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ టికెట్లు ఇవ్వలేదు. చెన్నమనేని రమేష్ కు పౌరసత్వం సమస్య ఉందని, మరోచోట తండ్రి అనారోగ్యం కారణంగా కుమారుడికి సీటు ఇవ్వాలని కుటుంబం చెప్పడంతో సిట్టింగ్ లకు సీట్లు రాలేదన్నారు. కానీ రేఖా నాయక్ పరిస్థితి అలా కాదు. రెండు సార్లు ప్రత్యర్థి పార్టీ నేతలపై భారీ మెజార్టీతో బీఆర్ఎస్ కు విజయాన్ని అందించారు. నియోజక వర్గంలో కొన్ని వివాదాలు, వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా చేయడం స్థానికంగా ప్రజల్లో ఆమెపై అసంతృప్తి ఉందన్నది కొంత వాస్తవం. కానీ పార్టీ కోసం పాటుపడిన తనను టికెట్ ఇవ్వకుండా అవమానించారని ఆమె భావిస్తున్నారని సన్నిహితులు చెబుతు న్నారు. అజ్మీరా రేఖ నాయక్ 2009లో రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ తరపున ఆసిఫాబాద్ జెడ్.పి.టి.సి. మెంబర్ గా పోటీచేసి విజయం సాధించారు. 2013లో బీఆర్ఎస్ ( అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి)లో చేరి, ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 2014లో ఖానాపూర్ శాసనసభ నియోజక వర్గం నుంచి పోటీచేసి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రితేష్ రాథోడ్ పై 30వేల మెజారితో విజయం సాధించారు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికలలో మరోసారి బీఆర్ఎస్ ఛాన్స్ ఇవ్వగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమేష్ రాథోడ్ పై 24,300 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

# కరీంనగర్ లో 'వేదిక వాచస్పతి' అవార్డు ప్రధానం

**కమాన్ పూర్**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కుచెందినబహుముఖ ప్రజ్ఞాశాలి, వ్యాఖ్యాత, స్థానిక కళాకారులు మేజిక్ రాజా మకుటంలో మరో కలికితురాయి చేరింది. అవార్డుల రారాజు మేజిక్ రాజా మంగళవారం మరో అవార్డును అందుకున్నారు. ప్రపంచ జానపద కళల దినోత్సవం, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ ఫిలిం భవన్ లో నిర్వహించే కార్యక్రమంలో మేజిక్ రాజాకు 'వేదిక వాచస్పతి' అవార్డును ప్రదానం చేసారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హాజరైన నాలుగు బహిరంగ సభలకు రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి రచనలో రవీంద్ర భారతిలో ప్రదర్శితమైన మూడు నృత్య రూపకాలకు వ్యాఖ్యాతగా సాహితీవేత్తలను, కళాభిమానులను అలరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనేగాక ఉత్తరాఖండ్ లోని హరిద్వార్, మహారాష్ట్రలోని ముంబయ్ లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో కళా ప్రదర్శనలేగాక, రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించి రక్తి కట్టించారు. కాగా రాజా అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, తెలంగాణ యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నియర్ అండ్ డియర్, గోదావరి సరిగమల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ రాజాకు అభినందనలు తెలిపారు.

# దేవరకొండలో బిఆర్ఎస్ అసమ్మతి వర్గం భేటీ

**దేవరకొండ**

దేవరకొండ నియోజకవర్గానికి రవీంద్ర కుమార్ కు బిఆర్ఎస్ టికెట్ కేటాయించడం పట్ల అసమ్మతి వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. రవీంద్ర కుమార్ అహంకార వైఖరిని వివరిస్తూ నేతలు ఆవేదన వ్యక్తం చేసారు. రవీంద్ర కుమార్ గెలుపు కోసం పనిచేసేదే లేదని అసమ్మతి వర్గం నాయకులు తేల్చిచెప్పారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ టికెట్టును దేవేందర్ నాయక్ కు ఇవ్వాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసారు. ఈ మేరకు ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన దేవేందర్ నాయక్ నేతృత్వంలో అసమ్మతి వర్గం దేవరకొండ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.

మన ఎమ్మెల్యే కదా అని పనుల మీద వెళ్లిన నాయకులను, కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా రవీంద్ర కుమార్ అహంకార వైఖరిని ప్రదర్శిస్తారని వివరించారు. నియోజకవర్గ పరిధిలోని నాయకుల అభిప్రాయాలను పట్టించుకోకుండా టికెట్టు కేటాయించడం పట్ల అసమ్మతి వర్గం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధుల, నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుంటూ దేవేందర్ నాయక్ కు టికెట్ కేటాయించాలని అసమ్మతి వర్గం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ, దేవరకొండ ఎంపీపీ జాన్ యాదవ్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరంజీవిని విమర్శించలేదు

**గుడివాడ**

సినీ ఇండస్ట్రీలో శిఖరాగ్రన ఉన్న మెగాస్టార్ చిరంజీవిని తాను విమర్శించినట్లు టిడిపి, జనసేన నిరూపించాలని మాజీ మంత్రి కొడాలి నాని చాలెంజ్ చేశారు. నేనేం మాట్లాడానో అన్నదానిపై చిరంజీవి, ఆయన అభిమానులు, నేను క్లారిటీగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా గుడివాడలో చిరంజీవి అభిమాన సంఘాల నాయకుడు తోట సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన చిరంజీవి పుట్టినరోజు కార్యక్రమాల్లో మాజీ మంత్రి కొడాలి నాని పాల్గొని, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. పెద్దాయన చిరంజీవి సలహాలను తాము పాటిస్తానని, తమకు చెప్పినట్లే ఇండస్ట్రీలో ఉన్న పకోడీగాళ్ళకు కూడా చెప్పాలని మాత్రమే నేను చెప్పానని కొడాలి నాని అన్నారు. మేము శ్రీరామ అన్నా టిడిపి, జనసేనలకు బూతు మాటలుగా వినిపిస్తాయన్నారు. జగన్ గురించి, తమ గురించి ఎవరు మాట్లాడిన చీల్చి చెండాడుతానని, ఎవరి జోలికి వెళ్ళని పెద్దాయన మెగాస్టార్ చిరంజీవిని విమర్శించే సంస్కారహీనుడును కాదని కొడాలి నాని అన్నారు.

## టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం

**తిరుమల**

తిరుమల శ్రీవారికి మంగళవారం క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఎండి సి.చక్రవర్తి విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించారు. ఈ వాహనం ధర రూ.1,18,276/- అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత వాహనం తాళాలను తిరుమల డిఐ జానకీరామ్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## బాలిక దారుణ హత్య

**ఒంగోలు**



బాలికను దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం కనిగిరి మండలంలోని ఎం.గొల్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక పొలాల్లో గుర్తు తెలియని బాలికను దుండగులు దారుణంగా హత్య చేశారు. గుర్తుపట్టకుండా బాలిక మొఖాన్ని రాయితో ఛిద్రం చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. బాలిక వయస్సు సుమారు 12 సంవత్సరాలు ఉండవచ్చని అంచనా వేశారు. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈనెల 28న ఢిల్లీకి చంద్రబాబు

**అమరావతి**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 28 న ఢిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ను కలుస్తారు. ఈ మేరకు అపాయింట్మెంట్ కోరుతూ టీడీపీ కార్యాలయం లేఖ రాసింది. ఏపీలో వైసీపీ దొంగ ఓట్లు చేర్చడం, ఓట్లు తొలగించడంపై చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు. సాక్ష్యాధారాలతో సహా సీఈసీకి అందించాలని నిర్ణయించారు. టీడీపీ నేతల ఫిర్యాదులను అధికారులు పట్టించుకోవట్లేదని ఫైర్ అయ్యారు. జిల్లా అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదులు, వారు స్పందించని వైనాన్ని సీఈసీకి వివరించాలని నిర్ణయించారు. ఏపీలో ఓట్ల జాబితాలో అక్రమాలపై సమాచార సేకరణకు ఇప్పటికే టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసారు.

## ఇంజనీరింగ్ కాలేజీలో దేశభక్తిపై సెమినార్

**నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్తిపై సెమినార్ నిర్వహించారు .ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేజర్ జనరల్ బొల్లినేని వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిపై ఏ రకంగా ఉండాలో వారికి వివరించడం జరిగిందన్నారు ప్రతి ఒక్కరూ కూడా దేశం కోసం పోరాడాలని ఆయన కోరారు దేశభక్తి విద్యార్థుల్లోనే ఉందని వారికి తెలియపరిచే విధంగా ఈ యొక్క కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆర్మీ వైపు వెళ్లే విధంగా తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, అడ్డాల శ్రీహరి , కే త్రినాథ్ , మరియు బోర్డ్ నెంబర్స్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు..

## ఇళ్ల స్థలాలకు హద్దులు చూపాలని ఆందోళన

**అనంతపురం**

రజకులకుప్రభుత్వంఇళ్ల నిర్మాణం కోసం పట్టాలిచ్చిన స్థలాలకు హద్దులు చూపాలని కోరుతూ రజక సంఘం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పెద్దవడుగూరుస్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ పట్టాలిచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ హద్దులు చూపలేదన్నారు. వెంటనే హద్దులు చూపడంతోపాటు ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం సమర్పించారు.

# గుప్తనిధుల కోసం తవ్వకాలు

**నెల్లూరు, ఆగస్టు 22:**

నెల్లూరు జిల్లా పొదలకురు మండలం చారిత్రక ఆలయాలకు పెట్టింది పేరు?ఇక్కడి ప్రభగిరి పట్నంలో వంద ఆలయాలు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు?అయితే కాల క్రమంలో కొన్ని ఆలయాలు తెర మరుగుకాగా కొన్ని ఆలయాలు రూపు కోల్పోయి కాల గర్భంలో కలిసిపోయాయి?అయితే ఇక్కడ గుప్త నిధుల ఉన్నాయని ఏళ్ల తరబడి ప్రచారం జరిగింది.. గుప్త నిధుల కోసం కొండలు ఆలయాలను తవ్వేసిన సందర్భాలు కోకొల్లలు?.అయితే ఇక్కడ తవ్వకాలు జరిపిన వారికి గుప్త నిధులు దొరికాయా లేదా అనేది పెద్ద ప్రశ్న?ఇదంతా ఇప్పుడు చెప్పడానికి ప్రత్యేకమైన కారణం లేకపోలేదు. నెల్లూరు జిల్లా పొదలకురు మండలం చిట్టెపల్లి లో నలుగురు యువకులు తేనె కోసం గ్రామ సమీపంలోని కొండ పై ఉన్న పురాతన అంకమ్మ ఆలయం వద్దకు వెళ్లగా అక్కడ వారికి ఎంతో విలువైన బంగారు నాణేలుతో కూడిన చెంబు దొరికింది.చిట్టెపల్లి కి చెందిన వరుణ్, అజిత్, వెంకటేశ్వర్లు కలిసి తేనె కోసం కొండ మీద వున్న అంకమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. అక్కడ రాళ్ల కింద వారికి ఇత్తడి చెంబు కనిపించింది. అయితే రాళ్లను తొలగించి చెంబు ను బయటకు తీసిన యువకులు దాన్ని పగులకొట్టి చూడగా అందులో బంగారు నాణేలు కనిపించాయి. అయితే నాణేలు చూసి భయపడిన యువకులు గ్రామంలో ఒకరి వద్దకు వెళ్లి చెంబును పూర్తిగా పగులకొట్టి చూడాలని ఇచ్చారు. దాంతో చెంబు ను లోపలికి తీసుకువెళ్లిన వ్యక్తి కాసేపు ఆగి బైటికి వచ్చి చెంబులో ఏమి లేవని చెంబు బయట పడేయాలని చెప్పాడు.అయితే అప్పటికే చెంబులో దొరికిన నాణేలను ఫోటో తీసిన యువకుడు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ఎస్పీ ని కలిశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారించగా వంద గ్రాముల నాణేలను రికవరీ చేసినట్లు తెలిసింది.అయితే చెంబులో దొరికిన నాణేలు మూడు కేజీలకు పైగా వుంటాయని కోట్ల రూపాయలు విలువ చేస్తాయని స్థానికులు అంటున్నారు. జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే కోట్ల రూపాయల విలువైన నాణేలు బయటకు వస్తాయని అంటున్నారు స్థానికులు. అయితే దొరికిన బంగారు నాణేలు ఏ శతాబ్దానికి చెందినవో తెలియదు. కానీ, వాటిపై తాజ్ మహల్ పదాలు వచ్చేలా ఉర్దూ లో ఉన్నాయని చెప్పారు. యువకులకు బంగారు నాణేలు దొరికాయి. కానీ, వాటాల్లో తేడాతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో నెల్లూరు జిల్లా లో ఎక్కడ ఏ ఇద్దరు చేరినా ఈ బంగారు నాణేల చెంబు గురించే మాట్లాడుకుంటున్నారు.

# గల్లా, కేశినేని... ఏమైపోయారు

**యువగళంలో కనిపించని ఎంపీలు**

**విజయవాడ, ఆగస్టు 22 :**

యువగళం పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతుంది. జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభమైన లోకేష్ పాదయాత్ర ఉమ్మడి కృష్ణా జిల్లాకు చేరుకుంది. విజయవాడ ప్రకాశం బ్యారేజి సమీపంలోని సీతానగరం చేరుకునే సరికి 2500 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా సీతానగరంలో శిలాఫలకం ఆవిష్కరించారు లోకేష్.వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనున్న మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల ఇళ్ల నిర్మాణానికి ఈ శిలాఫలకం వేసారు.అధికారంలోకి రాగానే ఇళ్ల నిర్మాణం చేపడతామని లోకేష్ హామీ ఇచ్చారు.పాదయాత్రకు అన్ని జిల్లాల్లో పార్లమెంట్ ఇంచార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గం ఇంచార్జిలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరవుతున్నారు.ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాదయాత్ర ముగిసిన తర్వాత ఉమ్మడి కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది.ఈ రెండు ఉమ్మడి జిల్లాలు తెలుగుదేశం పార్టీకి ఎంతో కీలకమైనవి. పార్టీకి గతంలో అత్యధిక ఎమ్మెల్యే,ఎంపీ స్థానాలు తెచ్చిపెట్టాయి.అంతెందుకు వైఎస్సార్సీపీ ప్రభంజనం ఎక్కువగా ఉండి 151 సీట్లు గెలుచుకున్న సమయంలో కూడా గుంటూరు,విజయవాడ ఎంపీ స్థానాలు తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది.కానీ లోకేష్ పాదయాత్రలో మాత్రం ఈ ఇద్దరు ఎంపీలు ఎక్కడా కనబడలేదు.గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్,విజయవాడ ఎంపీ కేశినేని నాని పాదయాత్రకు దూరంగా ఉన్నారు. ఉన్న ముగ్గురు ఎంపీలలో ఇద్దరు ఎంపీలు లోకేష్ కు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్,విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇద్దరూ కూడా లోకేష్ యువగళం పాదయాత్రకు దూరంగా ఉండటం రాజకీయవర్గాల్లో చర్చగా మారింది.గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తెలుగుదేశం పార్టీలో కీలకమైన వ్యక్తి.,పార్టీతో ఎలాంటి విబేధాలు లేవు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో నేతలంతా పాల్గొన్నప్పటికీ ఒక్క జయదేవ్ మాత్రం హాజరుకాకపోవడం చర్చగా మారింది. పాదయాత్రకు ఎందుకు దూరంగా ఉన్నారనేది ఎవరికీ అంతుపట్టడం లేదు.మరోవైపు కేశినేని నాని వ్యవహారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీలో ఉన్న విభేదాలను బయటపెట్టింది.ఇప్పటికే ఆయన సోదరుడు కేశినేని చిన్నిని పార్టీ అధినేత చంద్రబాబు ఎంకరేజ్ చేస్తున్నారంటూ ఆగ్రహంతో ఉన్నారు కేశినేని నాని. రాజకీయ ఆధిపత్యం కోసం జిల్లాలో ఉన్న మెజార్టీ ఇంచార్జిలు,ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేసారు చిన్ని. దీంతో అవకాశం దొరికినప్పుడల్లా అధిష్టానంపై, కొంతమంది నాయకులమీదా తన అక్కసు వెళ్లగక్కుతున్నారు ఎంపీ కేశినేని.అటు లోకేష్ యువగళం పాదయాత్ర బాధ్యతలు కూడా సోదరుడు చిన్నికి అప్పగించడంతో మరింత అసంతృప్తికి లోనయ్యారని సమాచారం. లోకేష్ పాదయాత్ర విజయవాడలో కొనసాగినప్పుడు ఎక్కడా కేశినేని కనబడలేదు..కనీసం ఫ్లెక్సీల్లో ఫొటోలు కూడా లేవు.నాని వ్యవహారం టీడీపీ కి కొత్త తలనొప్పి తీసుకొస్తే వైఎస్సార్ సీపీ మాత్రం దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకుంది.సొంతపార్టీ నేతలే పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అవుతుందనే ఉద్దేశంతో దూరంగా ఉన్నారంటూ వైసీపీ విమర్శలు కురిపిస్తుంది.లోకేష్ పాదయాత్రను విజయవాడ సిటీలో భారీ సక్సెస్ చేయడం ద్వారా మళ్లీ పాతవైభవం తెచ్చుకోవాలని టీడీపీ ప్రయత్నం చేసింది.విజయవాడ అభివృద్ధి కూడా తెలుగుదేశం పార్టీనే చేసిందంటూ చెప్పుకొచ్చింది.అయితే పాదయాత్ర ను లైట్ తీసుకున్నామంటూ వైసీపీ నేతలు ప్రకటించారు. లోకేష్ పాదయాత్ర ఈవెనింగ్ వాక్ లా ఉందని,కిరాయి జనంతో పాదయాత్ర చేసారని చెప్పుకొస్తున్నారు.విజయవాడ అభివృద్ధి టీడీపీ హయాంలో ఎందుకు చేయలేదో చెప్పాలని వైసీపీ నేతలు డిమాండ్ చేసారు. పాదయాత్ర సక్సెస్ కాదనే ఉద్దేశంతోనే సొంతపార్టీ ఎంపీలు దూరంగా ఉన్నారంటూ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. మొత్తానికి తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న లోకేష్ పాదయాత్రకు ఉన్న ముగ్గురిలో ఇద్దరు ఎంపీలు హాజరుకాకపోవడంతో భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయాలు ఉంటాయో అనే చర్చ మొదలైంది.

# యూ టర్న్ తీసుకుంటున్నారా...

**విజయవాడ, ఆగస్టు 22:**

అసెంబ్లీ ఎన్నికలు దగ్గపడుతున్న క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో హడావుడి నెలకొంది. కొందరు పార్టీ మారుతుంటే మరి కొందరికి టికెట్ టెన్షన్ పట్టుకుంది. ఇప్పుడు కృష్ణా జిల్లా గన్నవరం రాజకీయాలు రోజురోజుకూ కీలక మలుపులు తిరుగుతున్నాయి. నారా లోకేష్ పాదయాత్ర ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రవేశించడానికి ముందు ఆత్మీయ సమావేశం పేరిట బలనిరూపణకు దిగినయార్లగడ్డ వెంకట్రావు గన్నవరంలోనే రాజకీయాలు చేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత ముఖ్య అనుచరులతో సమావేశమై వైసీపీని మారుతున్నట్లు ప్రకటించారు. నారా చంద్రబాబు అపాయింట్మెంట్ కోరిన యార్లగడ్డ వెంకట్రావు హైదరాబాద్ వెళ్లి చంద్రబాబును కలిసి పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ సీపీలో ఆరు సంవత్సరాలు కష్ట పడ్డానని, అయినా పార్టీలో తనకు గుర్తింపు లభించలేదని చెప్పారు. అందుకే పార్టీ వీడుతున్నట్లు చెప్పారు. అయితే టీడీపీలో చేరినా గన్నవరం నుంచి మాత్రం పోటీ చేస్తానని చెప్పలేదు. తన సీటు విషయంలో అధినేత చంద్రబాబు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. పార్టీ ఎక్కడి నుంచి పోటీ చేయాలని ఆదేశిస్తే అక్కడి నుంచి పోటీ చేస్తానని యార్లగడ్డ చెబుతున్నారు.ఇక చంద్రబాబుతో భేటీ తర్వాత యార్లగడ్డ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు గన్నవరం ప్రజలను వీడేది లేదు, 2024లో గన్నవరం నుంచే పోటీ చేస్తానని చెప్పుకొచ్చాన యార్ల గడ్డ సొంత ప్రాంతం కాకపోయినా తనను ఇంతలా ఆదరిస్తున్న గన్నవరం ప్రజలకు సేవ చేసేందుకు ఇక్కడి నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. మరి చంద్రబాబుతో భేటీ తర్వాత యార్లగడ్డ మాత్రం గన్నవరం నుంచి పోటీ చేస్తానని మాత్రం చెప్పలేదు. చంద్రబాబు సీటుపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవంతోనే యార్లగడ్డ చెప్పలేదని తెలుస్తుంది. అంతేకాకుండా కొత్తగా గుడివాడ పేరును తెరపైకి తెచ్చారు. గన్నవరంలో వల్లభనేని వంశీతోపాటు గుడివాడలో కొడాలి నానిని ఎలాగైన ఓడించాలనేది టీడీపీ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే చంద్రబాబుతో భేటీలో గుడివాడ ప్రస్తావన వచ్చి ఉండవచ్చునని తెలుస్తోంది. ప్రస్తుతం టీడీపీకి గన్నవరం, గుడివాడ నియజకవర్గాల్లో సరైన అభ్యర్థులు లేరు. గుడివాడలో సీటు కోసం రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాము పోటీ పడుతున్నారు. ఇక గన్నవరం స్థానంలో పోటీ కూడా లేదు. ఈ రెండు స్థానాల్లో యార్లగడ్డ బలం పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాత సీటుపై హామీ ఇస్తానన్నారా? అనే చర్చ కూడా కొనసాగుతోంది. అయితే యార్లగడ్డకు గర్నవరం టికెట్ ఇస్తే అక్కడ పోటీ హోరాహోరీగా ఉంటుందనే చెప్పాలి.

# బెగ్గింగ్ మాఫియాలో నమ్మలేని నిజాలు

**హైదరాబాద్, ఆగస్టు 22:**

హైదరాబాదులో ఎక్కడ ఏ సిగ్నల్ చూసిన సరే ముందుగా మనకు కనిపించేది బిచ్చగాళ్ళ ముఠా. కొంతమంది బిచ్చగాళు ్ళ చిన్న పిల్లలను వేసుకొని మరి రోడ్డు మీద అడ్డుక్కునీటుంటారు? ఇటీవల వరుసగా బిగ్గినీగ్ మాఫియా లపై హైదరాబాద్ పోలీసులు వరుస దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.. అయితే పోలీసుల విచారణలో కొన్ని నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్లో అడుక్కుంటున్న చాలా ముఠాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఎక్కువ మంది గుల్బర్గా ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. గుల్బర్గా ప్రాంతానికి చెందిన అనిల్ పవర్ అనే వ్యక్తిని పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్ట్ చేశారు. బెగ్గింగ్ రాకెట్‌కు అనిల్ పవర్ కీలక సుత్రదరుడిగా ఉన్నాడు.. ఇతడితోపాటు ముఠా సభ్యులుగా ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసుల వేట కొనసాగుతుంది. గుల్బర్గా నుంచి 20 కుటుంబాలను ఉద్యోగం పేరుతో ఇక్కడికి తీసుకొచ్చాడు అనిల్ పవర్. 20 మంది కుటుంబాల్లో చిన్నపిల్లల సైతం ఈ బెగ్గింగ్ మాఫియాలోకి దించాడు. ప్రతి సోమవారం పారడైజ్ సిగ్నల్ దగ్గర బిచ్చం అడుక్కోవడం వీరి పని. అయితే చిన్న పిల్లలను కలిగి ఉన్న మహిళలకు అడుక్కునే విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తూ వచ్చాడు. మహిళల గుడిలో ఉన్న పిల్లలను చూసి చాలామంది ప్రజలు కరిగిపోయి కొంత డబ్బులు ఇస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న బెగ్గినీగ్ మాఫియా నిర్వాహకులు చిన్నపిల్లలు ఎప్పుడు పడుకునే ఉండేలా ప్లాన్ చేశారు.చిన్నారులు అలా పడుకునే ఉండేలా చిన్నపిల్లలకు మత్తు ఎక్కిస్తున్నారు నిర్వాహకులు. దీంతో డోసేజ్‌కు నుంచి మాతో ఇవ్వటంతో ఆ చిన్నారి లేవకుండా అలానే నిద్రపోతుంటాడు. ఇలా పడుకున్న చిన్నారిని ఒక మహిళ చేతిలో పెట్టి ఎలా బిచ్చం అడగాలో ట్రైన్ చేస్తారు. అలా మనుషుల ఎమోషన్స్‌తో ఆడుకుంటూ లక్షలు సంపాదిస్తున్నారు బెగ్గింగ్ మాఫియా సభ్యులు. రోజుకి నిర్వాహకులకు 6వేల నుంచి 8వేల రూపాయలు కలెక్షన్ వస్తే అందులో బెగ్గింగ్ చేస్తున్న వారికి కేవలం 200 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు నిర్వాహకులు. గుల్బర్గా నుండి తీసుకొచ్చిన 20 కుటుంబాలను 20 టీములుగా విభజించి ఓల్డ్ సిటీ నుండి హైటెక్ సిటీ వరకు ఉన్న వివిధ జంక్షన్ ల వద్ద వీరితో బిచ్చం ఎత్తుకునేలా చేస్తున్నారు. జువైనల్ యాక్ట్ సెక్షన్ 76, 77 తో పాటు తెలంగాణ ప్రివెన్షన్ ఆఫ్ బెగ్గింగ్ యాక్ట్ సెక్షన్ 27, 28 ప్రకారం వీరిపై కేసులు నమోదు చేస్తున్నారు పోలీసులు.

# బీఆర్ఎస్‌లో చేరనున్న కోనేరు సత్యనారాయణ

**కొత్తగూడెం**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు తనయుడు కోనేరు సత్యనారాయణ అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. సోమవారం రాత్రి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సత్యనారాయణ (చిన్ని) కలిశారు. ఈ సందర్భంగా కొనేరు చిన్నిని బీఆర్ఎస్‌లోకి పార్టీ అధినేత ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చిన్న నేడు రాజీనామా చేయనున్నారు. అనంతరం కారెక్కనున్నారు. మూడు నెలల ముందే ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల బరిలో దూసుకుపోతున్నది. పార్టీని నమ్ముకున్న ఎమ్మెల్యేలకు తిరిగి టికెట్లు దక్కడంతో సీఎం కేసీఆర్ నమ్మకానికి పెద్దపీట వేసినైట్లైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖమ్మం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ సీటు ఖరారు చేశారు. అలాగే ఎమ్మెల్యేలుగా వివిధ పార్టీల నుంచి గెలుపొంది బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆరుగురు శాసన సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ టికెట్లు ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడంతో జిల్లాలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో అయోమయం నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్న కాంగ్రెస్ పార్టీ శిబిరంలో నిరాశ నిస్పృహలు అలుముకున్నట్లు ప్రచారం జరుగుతున్నది.ఉమ్మడి జిల్లాకు సంబంధించి రాజకీయ ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేసేలా.. సొంత పార్టీ శ్రేణులకు రాజకీయ ఊతమిచ్చేలా అభ్యర్థుల ఎంపిక ఉండడంతో పార్టీలు పార్టీ అధినేత కేసీఆర్ మాస్టర్ స్ట్రోక్‌కు ప్రత్యర్థి రాజకీయ వర్గాలకు దిమ్మతిరిగేలా ఉందనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. కాగా, జిల్లాలోని అన్ని స్థానాలను సొంతం చేసుకునేలా పార్టీ అధినేత వ్యూహం రచించారు. ఇందులో భాగంగా ఇతర పార్టీలకు చెందిన నాయకులను పార్టీలో చేర్చుకుంటూ బలం పెంచుకుంటున్నారు.

# బడా బాబుల చేతుల్లోకి అసైన్డ్ భూములు

**అట్లూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా**

**బద్వేలు**



వైయస్సార్ కడపజిల్లా అట్లూరు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ బి.సి.సంక్షేమ సంఘం,భారత కమ్యూనిస్టు పార్టీ ( సి.పి.ఐ ) మరియు ప్రజా సంఘాలు,టీడీపీ,వైసీపీ ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీలో అర్హులైన పేదలకు భూములు దక్కకుండా భూములు ఉన్న బడా భూస్వాములకు మాత్రమే భూములు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అట్లూరు మండలం నల్లాయపల్లె గ్రామపోలంలోఅట్లూరు మండలం నల్లాయపల్లె రెవెన్యూ పొలం 89,90,92,93,95,97,98,99,100,103,113,114, 115,116,117,118 మరికొన్ని సర్వే నెంబర్లలో వందల ఎకరాలలో తహశీల్దార్ కు తెలిసే వందల ఎకరాలు భూములు కబ్జా చేస్తున్న తహసిల్దార్ ఏమి చేస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక తహశీల్దార్,సచివాలయం సమీపంలోని 404,405 సర్వే నెంబర్ లో ఒక్కొక్కరికి 5, 10,సెంట్లలో ఇంటి స్థలాల ఆక్రమణలు రెవెన్యూ అధికారులు కుమ్మక్కుతోనే జరుగుతున్నాయని వాటిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఇసుక,మట్టి పరిమిషన్లపై ఒక్కక్క ట్రాక్టర్ ట్రిప్పర్ ట్రిప్పుకు 250 నుంచి 350 వసూలు చేసి ప్రభుత్వానికి అందజేయకుండా నొక్కేస్తున్నారని ఆరోపించారు. ఆన్లైన్ మోసాలపై ఉన్నతాధికారులు వెలికితీయాలని ప్రజలు,ప్రజాసంఘాలు స్థానిక తహశీల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బి.సి సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి రాజగోపాలయ్య ,వైసీపీ నేత బీ.సీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమణయ్య,టీడీపీ ఎస్సి సెల్ నియోజకవర్గ నాయకులు రుషి కేశవ్,జాతీయ బి.సి సంఘం జిల్లా కార్యదర్శి రాం నరసింహులు,బీసీ నాయకులు ఈటె.మస్తానయ్య, వైసిపి నేత మట్లి ఈశ్వర రెడ్డి,భారత కమ్యూనిస్టు పార్టీ ( సి.పి.ఐ ) జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్,బద్వేలు పట్టణ అధ్యక్షులు బాలు,ఏ ఐ టి యు సి కన్వీనర్ రాజు, అట్లూరు మండల కన్వీనర్ నిత్యపూజయ్య తదితరులు పాల్గొన్నారు

# సమాంతరంగా సంక్షేమం, అభివృద్ధి

**నెల్లూరు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సంక్షేమం అభివృద్ధి రెండు కూడా సమానంగా సాగుతున్నాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదు అనే వారికి కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శనం అన్నారు. రాజకీయ స్వార్థం కోసం చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ పడారుపల్లిలోని చలపతి నగర్ లో అభివృద్ధి పనులకు గౌరవ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు రూరల్ ఇంచార్జ్ శ్రీ ఆదాల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. చలపతి నగర్ లో 40 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. 23వ డివిజన్లో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఐదుకోట్ల 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు.ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మరో కోటి రూపాయల నిధులను కూడా మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# పక్కా ప్లాన్ తో హ్యాట్రిక్ అడుగులు

## పాజిటివ్ ఓటుపైనే ఆశలు

హైదరాబాద్, ఆగస్టు 22:

సీఎం కేసీఆర్ గతం కంటే భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వరుసగా మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధించటంతో పాటుగా ప్రతిపక్షాలను దెబ్బ కొట్టాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఈసారి గజ్వేల్ తో పాటు కామారెడ్డి నుంచి బరిలో దిగనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ ను కామారెడ్డి నుంచి పోటీ చేయాలంటూ ఆయన ఇప్పటికే మూడు సార్లు ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కామారెడ్డి నుంచి పోటీ చేయాలని నిర్ణయానికి రావడం రాజకీయ వ్యూహంలో భాగమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. కేసీఆర్‌కు కామారెడ్డికి వీడదీయరాని అనుబంధం ఉంది. కేసీఆర్ పుట్టింది కామారెడ్డి నియోజకవర్గంలోనే. బీబీ పేట్ మండలం కొనాపూర్ సీఎం కేసీఆర్ సొంత ఊరు. ఆయన ఇదే గ్రామంలో పుట్టారు. తల్లి వెంకటమ్మ కు ముస్తాబాద్ కు చెందిన రాఘవ రావు తో ఇల్లరికం పెళ్లి చేశారు. మిడ్ మానేరు డ్యామ్ నిర్మాణం తో కొనాపూర్ ముంపు నకు గురికావడంతో.. ఊరు ఖాళీ చేసి చింత మడకకు కేసీఆర్ ఫ్యామిలీ మకాం మార్చింది. కేసీఆర్ పూర్వీకుల మూలాలు కామారెడ్డిలో ఉండటం పోటీకి రాజకీయంగా బలంగా ఉండటంతో.. కేసీఆర్ ఇక్కడ నుంచి పోటీకి కామారెడ్డిని ఎంచుకున్నట్టు తెలుస్తోంది. కామారెడ్డి నుంచి కేసీఆర్ బరిలో దిగడం వల్ల ఉమ్మడి జిల్లాతో పాటు పక్క జిల్లాల పై ప్రభావం చూపనుంది. ఉత్తర తెలంగాణలో గత ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ లోక్ సభ స్థానాలు సొంతం చేసుకుని ఈ ప్రాంతంలో పాగా వేయాలని చూస్తున్న కమలం పార్టీకి చెక్ పెట్టొచ్చని వ్యూహ రచన చేసినట్టు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ తో పాటు జగిత్యాల, కరీంనగర్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో అక్కడక్కడా ఉన్న వ్యతిరేకతతో పాటు పార్టీలో అసంతృ ప్తులు, గ్రూపులు వర్గ విబేధాలన్నీ సమసిపోయే విధంగా ఇది ఒక వ్యూహాత్మక మేనని అంటున్నారు పార్టీ శ్రేణులు. ముఖ్యమంత్రి కామారెడ్డిలో పోటీపై కొద్ది నెలలుగా జోరుగా ప్రచారం జరిగింది. ఈ పాటికే పలు దఫాలుగా సర్వేలు చేశారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సంక్షేమ ఫలాలు వాటి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. మొత్తంమీద.. గులాబీ బాస్ కామారెడ్డిలో పోటీతో.. రాజకీయ సమీకరణాలు, పరిణామాలు మారిపోనున్నాయి. అందులో భాగంగా ప్రతిపక్షాల హామీలను పసి గట్టిన ముఖ్యమంత్రి వారి హామీలను తానే అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన నాలుగు వేల రూపాయాల పెన్షన్ ను తానే అమలు చేస్తానని ప్రకటించారు. కేసీఆర్ హామీ ఇచ్చి అమలు చేయనివి తనకు అనుకూలంగా మలచుకోవాలని ప్రతిపక్షాలు భావించాయి. కానీ, రుణమాఫీతో సహా అన్నింటినీ అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో ఉద్యోగ నియమాలపైన కసరత్తు జరుగుతోంది. ఉద్యోగులకు పీఆర్సీతో పాటుగా ఐఆర్ ప్రకటనకు ముఖ్యమంత్రి సిద్ధం అవుతున్నారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా : పదేళ్ల పాటు అధికారంలో ఉన్న తరువాత ప్రభుత్వంపైన ఎంతో కొంత వ్యతిరేకత సహజం. కానీ, కేసీఆర్ పూర్తిగా పాజిటివ్ ఓటింగ్ నే తన అస్త్రంగా నమ్ముకుంటున్నారు. పదేళ్ల కాలంలో తాను తెలంగాణలో చేసిన నిర్ణయాలు..అమలు చేస్తున్న పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళు న్నారు. రాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం..పూర్తయిన ప్రాజెక్టులు..మారిన హైదరాబాద్ రూపురేఖలు ..రైతులకు దాదాపు 70 వేల కోట్లకు పైగా ఈ తొమ్మిదేళ్ల కాలంలో చేసిన రుణమాఫీపైన ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. అదే విధంగా 24 గంటల విద్యుత్, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, సంక్షేమ పథకాల అమలు పైన ప్రజల్లో సానుకూలత ఉందని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో, ప్రతిపక్షాలకు ఏ మాత్రం అవకాశం లేకుండా ముఖ్యమంత్రి అన్నీ తానై ఎన్నికల నిర్ణయాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలకు పవన్ కల్యాణ్ చిన్న బ్రేక్.. కొత్త వ్యూహాలతో ప్రజల్లోకి : ఇక, ఊహించని విధంగా ప్రతిపక్షాల కంటే ముందుగానే సీఎం కేసీఆర్ ఏకంగా 114 మంది అభ్యర్థులను ప్రకటించారు. దీని ద్వారా తన సిట్టింగ్ ఎమ్మెల్యేల పైన నమ్మకం..తాను నమ్ముకున్న పాజిటివ్ ఓటింగ్ తో గెలుస్తామనే ధీమాను స్పష్టం చేస్తున్నారు. అభ్యర్దులను ఖరారు చేసి, ఇక సీఎం నుంచి అభ్యర్దులు అంతా ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉండాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో రెండు బహిరంగ సభలను నిర్వహించబోతున్నారు. ఇదే సమయంలో సీట్లు నిరాకరించిన వారికి భవిష్యత్ పై హామీ ఇస్తున్నారు. తమ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి వెళ్లే అవకాశం ఉన్న వారిని నియంత్రించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అలాగే, ఇతర పార్టీల నుంచి వలసలు పెరిగేలా గేమ్ మొదలైంది.

# బస్సు బైకు డీ-ఒకరు మృతి

### జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



మేడ్చల్

బస్సు ను బైక్ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లా ధమారకుంట వరదరాజుపురం కు చెందిన సంపత్( 26) యూజె ఫార్ములా కంపెనీ లో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం డ్యూటీ నిమిత్తం వెళ్తుండగ కొల్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి పై తుర్కపల్లి నుండి ఎదురుగా వస్తున్న కర్కపట్ల ఫార్మా కంపెనీ బస్సు, ద్విచక్ర వాహనం రెండు ఢీ కొనడంతో వాహనం పై ఉన్న సంపత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో ఒక్కసారిగా ద్విచక్ర వాహనం నుండి మంటలు చెలరేగి బస్సు కు కూడా అంటుకోవడంతో రెండు దగ్ధం అయ్యాయి. స్థానికుల సమాచారం తో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేకున్నారు. అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్న మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు

# మంత్రి మల్లారెడ్డి ఇంటిదగ్గర సంబరాలు

మేడ్చల్

మేడ్చల్ అసెంబ్లీ స్థానానికి బిఆర్ఎస్ తరఫున మంత్రి మల్లారెడ్డి పేరు ఖరారు కావడంతో న్యూబోయిన్ పల్లి లోని ఆయన ఇంటి వద్ద సంబరాలు అంబరాన్ని అంటాయి.. మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకొని శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్చాలు అందజేశారు.. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తనకు తిరిగి మేడ్చల్ నుంచి అవకాశం కల్పించినందుకు ముఖ్య మంత్రి కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో అఖండ మెజారిటీతో తన గెలుపు ఖాయమని ప్రతిపక్షాల ఊసే లేదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తిరిగి గెలుపుకు దోహదపడతాయని పేర్కొన్నారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వ్యాఖ్యల విషయంలో అధిష్టానమే చూసుకుంటుందని అన్నారు..

# గిరిజన మహిళపై పోలీసుల దాడి

## ఖండించిన గిరిజన నేతలు

హైదరాబాద్

అకారణంగా ఆగస్టు 15వ తేదీన గిరిజన మహిళపై పోలీసులు దాడికి పాల్పడిన సంఘటనను ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. బాధిత మహిళకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడం మహిళల పట్ల ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ మగ్దూం భవన్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కాలకొండ కాంతయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, ఉపాధ్యాక్షుడు నెర్లకంటి శ్రీకాంత్, ఎఐఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడారు. హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఎల్.బి.నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు గిరిజన మహిళపై అమానుషంగా దాడి చేయడాన్ని అంజయ్య నాయక్ తీవ్రంగా ఖండించారు. ఆగస్టు 15వ తేదీ రోజు తన కుమార్తె వివాహం కోసం తమ్ముని ఇంటికి వెళ్లి వస్తున్న లక్ష్మి అనే గిరిజన మహిళలను రాత్రి 10:30 గంటల సమయంలో పోలీసులు అటకాయించి, స్టేషన్ తీసుకెళ్లి, చిత్రహింసలు పెట్టారన్నారు. తన కుమార్తె పెళ్లి కోసం తమ్ముని దగ్గర డబ్బులు, బంగారం వస్తువులు తీసుకొని, వెళ్లుతుందని, వాటిని చూపించిన పోలీసులు కనికరం చూపించలేదన్నారు. డబ్బులు, బంగారం వస్తువులు ఎక్కడ పోయాయో అనే విషయం బాధిత మహిళకు తెలియని పరిస్థితి ఉందన్నారు. విషయం బయటకు రావడంతో పోలీసులు హడావుడి 16వ తేదీ ఉస్మానియా ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రి, అక్కడి నుంచి ఎల్.బి.నగర్ ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టు తిప్పారని అంజయ్య నాయక్ చెప్పారు. విషయం తెలిసిన వెంటనే ప్రజా సంఘాలను పోలీసులను నిలదీయడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. సంఘటన జరిగి ఐదు రోజులైన ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఐదు రోజుల తరువాత మంత్రి సబితా ఇంద్రా రెడ్డి బాధితురాలిని పరామర్శించడం, గృహలక్ష్మి పథకం అమలు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. జరిగిన సంఘటనపై ఇప్పటి వరకు గిరిజన మంత్రి సత్యవతి రాథోడ్, హోంమంత్రి స్పందించలేదన్నారు. కింది పోలీసు సిబ్బంది సస్పెండ్ చేసి, కంటితుడుపు చర్యలు చేపట్టారని విమర్శించారు. జరిగిన సంఘటనకు డిసిపి, ఎసిపి బాధ్యత వహించాలన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సస్పెండ్ చేయాలని అంజయ్య నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితురాలికి తగిన న్యాయం జరగకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మహిళలపై దాడులు జరిగినా.. సర్కార్ మౌన పాత్ర : నెదునూరి జ్యోతి

నెదునూరి జ్యోతి మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన దేశం మొత్తం స్వాతంత్ర్య సంబురాల్లో ఉండగా, ఎల్.బి.నగర్ పోలీసులు గిరిజన మహిళపై అమానుషంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. జరిగిన సంఘటనను ఆమే తీవ్రంగా ఖండించారు. మగ పోలీసులు దాడి చేస్తున్నా అక్కడే ఉన్న మహిళా పోలీసులు అడ్డుచెప్పకపోవడం దారుణమన్నారు. సాయంత్రం ఆరుగంటల తరువాత మహిళలను పోలీస్ స్టేషన్ ఉండకూడదనే నిబంధనలు ఉన్న ఎల్.బి.నగర్ పోలీసులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తుందన్నారు. రాత్రి మొత్తం గిరిజన మహిళా లక్ష్మిని చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన నిందితులైన పోలీసులపై ఎస్ ఎస్ హత్యయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. ఇటీవల మహిళలపై దారుణాలు పెరిగిపోయిన ప్రభుత్వం ప్రేక్షపాత్ర పోషిస్తుందని జ్యోతి విమర్శించారు. పాలకుర్తి దొంగతనం పేరుతో మహిళను అగ్రకూల దురహంకారులు దారుణంగా దాడికిపాల్పడ్డారని, పెద్దపల్లి జిల్లాలో మధ్యప్రదేశ్ చెందిన మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కేసులో పెద్దల సంబంధికులు ఉండటంతో పోలీసులు కేసు నీరుగారుస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటనలపై కల్వకుంట్ల కవిత, మహిళా మంత్రులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. బతుకమ్మ పేరిట ఉత్సవాలు చేయడం కాదని, దాడికి గురన మహిళల పట్ల స్పందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసుల పేరిట చట్టాలను చేతుతుల్లోకి తీసుకుంటున్నారని విమర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం మెల్కోని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పార్లమెంటులో భారీ మెజారిటీ ఉన్న మహిళా బిల్లును ఎందుకు ఆమోదించడం లేదు

### బీఆర్ఎస్ టికెట్ల పంపిణీపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత ఫైర్



హైదరబాద్ ఆగష్టు 22

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బీజేపీ రెండుసార్లు హామీ ఇచ్చి మోసం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పార్లమెంటులో భారీ మెజారిటీ ఉన్నప్పటికీ మహిళా బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని నిలదీశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ టికెట్ల పంపిణీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల్లోమహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం ఉంది కాబట్టే దేశంలో 14 లక్షల మంది మహిళలు స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. చట్టసభల్లోనూ రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకురానిదే పరిస్థితుల్లో మార్పు సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలు మహిళలకు ఎన్ని టికెట్లు కేటాయిస్తాయో చూద్దామన్నారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్ల పంపిణీపై వెళ్లగకుతున్న అక్కసును తాము అర్థం చేసుకుంటున్నామని, టికెట్లు రాని అభ్యర్థులను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మీ రాజకీయ అభద్రతాభావాన్ని మహిళ ప్రాతినిధ్యానికి ముడి పెట్టవద్దని హితవు పలికారు. పార్లమెంటు సీట్ల సంఖ్యను పెంచి మూడో వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదించారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం ఏ చర్య తీసుకుందో చెప్పాలని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. మహిళా హక్కులపై ఆయన ఆందోళన ఆశ్చర్యపరిచినప్పటికీ స్వాగతిస్తున్నానని, చివరికి బీజేపీ నుంచి ఎవరోఒకరు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను ధ్రువీకరించారని పేర్కొన్నారు.

# కేసీఆర్ గొర్రెలు సబ్సిడీ రూ.55 లక్షలు

## - సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు

కమాన్ పూర్

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన గొర్రెలకు రూ. 55,12,500 లు చెల్లించడం జరిగిందని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. మంగళవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు తో పాటు మండల పశువైద్యాధికారి యారవ దుర్గాప్రసాద్ లు 6 గురు లబ్ధిదారులకు గొర్రెలను అందజేశారు. గతంలో రత్నాపూర్ లో మొదటి ఫేస్ కింద 55 యూనిట్ల గొర్రెలను అందజేయడం జరిగింది. రెండవ విడతలో 72 మంది లబ్ధిదారులు ఉండగా 42 మంది లబ్ధిదారులు రూ. 43,750/- చొప్పున డీ.డీలు చెల్లించారు. దీనిలో ప్రభుత్వం రూ. 1,31,250/- లు సబ్సిడీ క్రింద చెల్లించింది. 42 మందికి రూ. 55,12,500 లను సబ్సిడీ కింద కేసీఆర్ గొర్రెల పథకంను లబ్ధిదారులు పొందడం జరిగింది. దీనిలో




ఒక్కొక్క లబ్ధిదారునికి 20 గొర్రెలు, 1 పొట్టేలును అందించడం జరిగింది. లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నుండి మాచర్ల నుండి వీటిని కొనుగోలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపెల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ సహకారంతో లబ్ధిదారులకు ఈ గొర్రెల పథకం అందించడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులు మేడగొండ లస్మయ్య, ఉడుత రవి, ఉడుత మల్లయ్య , జక్కుల రాజేష్, కొండవెన సన్ని ప్రసాద్, కొండవెన స్వరూప లకు గొర్రెలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పెండ్లి రమ్య,యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల అజయ్, గెల్లు శేకర్, వెటర్నరీ అసిస్టెంట్ అత్తే మల్లికార్జున్, గోపాల మిత్ర జక్కుల శ్రీనివాస్,మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్నం మహేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఆగస్టు 22

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార పార్టీ బీఆర్ఎస్ స్పీడును పెంచింది. బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం సీఎం కేసీఆర్ కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. టాప్ గేర్‌లో దూసుకెళ్తున్నారు. కేబినెట్‌లో పట్నం మహేందర్‌రెడ్డికి చోటు కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. దీనికి ముహూర్తం సైతం ఖరారైంది. బుధవారం (ఆగస్టు 23) ఉదయం 11:30గంటలకు కేబినెట్ విస్తరణ జరగనుంది. 11.30 గంటలకు పట్నం మహేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి.. బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే, ఈటల రాజేందర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత చాలా కాలంగా ఆయన స్థానం ఖాళీగా ఉంది. ఇప్పటివరకు కేసీఆర్ భర్తీ చేయలేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఈటల స్థానాన్ని మహేందర్‌రెడ్డితో భర్తీ చేయనున్నారు. పలువురు పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ సీఎం కేసీఆర్.. కొంత కాలం నుంచి అసంతృప్తతో ఉన్న పట్నం వైపు మొగ్గుచూపారు. మంత్రి వర్గంలో 18 మందికి మాత్రమే ఛాన్స్ ఉంది. గతంలో 2014లో తెలంగాణ ప్రభుత్వ మొదటి క్యాబినెట్ లో రవాణా మంత్రిగా మహేందర్ రెడ్డి పనిచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో.. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి ఎన్నికై బీఆర్ఎస్ లో చేరిన సబితారెడ్డి.. కేసీఆర్ క్యాబినెట్లో ఛాన్స్ దక్కించుకోవడంతో మహేందర్ రెడ్డి తీవ్ర నిరాశకు గురయ్యారు. ఒకదశలో పార్టీ మారుతారనే ప్రచారం కూడా జరిగింది. ఎన్నికల ముందు సడెన్ గా పట్నంకు కేసీఆర్ క్యాబినెట్ లో ఛాన్స్ ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. =

# మైనంపల్లి క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్**

ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నోరు అదుపులో పెట్టుకో ..మంత్రి హరీష్ రావు పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోక పోతే వెంకటేశ్వర స్వామి కూడా నిన్ను క్షమించరని తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ ఎ .వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. .పవిత్రమైన తిరుమల లో మైనం పల్లి పాడు మాటలు మాట్లాడారు. .మంత్రి హరీష్ రావు పై హన్మంత రావు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సమాజం జీర్ణించుకునే పరిస్థితిలో లేదు. హరీష్ రావు చేస్తున్న ప్రజాసేవలో మైనంపల్లి ది పైసా వంతు కూడా ఉండదని అన్నారు. పార్టీ అంతర్గత వేదికల్లో చర్చించాల్సిన విషయాలను బహిరంగంగా మైనం పల్లి ప్రస్తావించడం క్రమశిక్షణా రాహిత్యమే. .మైనం పల్లి లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పకపోతే పార్టీ అధిష్టానం ఆయన పై చర్యలు తీసుకోవాలి. మైనం పల్లి తన ఇష్టారీతిగా మాట్లాడితే భరించడానికి ఎవరూ సిద్ధంగా లేరని అన్నారు. మైనం పల్లికి రాజకీయ పునర్జన్మను ఇచ్చింది బీ ఆర్ ఎస్ యే ..ఈ మాటను మైనం పల్లే స్వయంగా చెప్పారు. .హరీష్ రావు ను విమర్శించడం అంటే బీ ఆర్ ఎస్ ను విమర్శించడమేనని అన్నారు.

# ముందు జాగ్రత్తగా కేసీఆర్ రెండో స్థానంలో పోటీ

**హైదరాబాద్**

గజ్వేల్ ఓటర్లు తన్ని తరిమేస్తారని దొరకు బాగా అర్థమైనట్టుందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల వ్యాఖ్యానించారు. అందుకే ముందు జాగ్రత్తగా రెండో స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. స్వయానా ముఖ్యమంత్రి కే సొంత నియోజకవర్గంలో గెలుస్తాననే దమ్ము లేకపోవడంవిశేషం. కేసీఆర్ పదేళ్ల దిక్కుమాలిన పరిపాలనకు నిదర్శనం. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావు అనడానికి సంకేతం. దొర ఇన్నాళ్లు గజ్వేల్ ప్రజలను కలిసింది లేదు. వాళ్ల గోసలు తెలుసుకున్నది లేదు. పేరుకు ముఖ్యమంత్రి నియోజకవర్గమైనా డబుల్ బెడ్ రూం ఇండ్లు రాకపాయే. దళిత బంధు అందకపాయే. ఇక దొర గజ్వేల్ లో చూపెట్టే అభివృద్ధి అంతా ఖాళీ బిల్డింగులే. రాష్ట్రానికే ముఖ్యమంత్రిని అన్న అహంకారంలో కేసీఆర్ గజ్వేల్ కి ఎమ్మెల్యే అన్న సంగతి ఏనాడో మరిచిపోయిండని అన్నారు. కేసీఆర్ కు నిజంగా దమ్ముంటే.. తన పరిపాలన మీద తనకు నమ్మకం ఉంటే, సొంత నియోజకవర్గం గజ్వేల్ నుంచే గెలిచి చూపించాలని సవాల్ చేస్తున్నామని అన్నారు.

# అంతర్జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు ఎన్నికైన కాంటెవాడ రాధ.

**కమాన్ పూర్**




పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని ఎనిమిదవ కాలనీకు చెందిన కాంటే రాధా మలేషియాలో జరిగే ఈవెంట్స్ కు ఎన్నికయ్యారుమలేషియాలో సెప్టెంబర్ 16,17న జరిగే ఈవెంట్ కు తెలంగాణ నుండి భారత టీము ఢిల్లీ నుండి ప్రయాణంమలేషియాలోని కౌలాలంపూర్ లో సెప్టెంబర్ 16, 17వ తేదీలలో 35వ మలేషియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్-2023 పోటీలలో 45+ మహిళల విభాగంలో 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగు పందెం పోటీలలో పాల్గొనుటకు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఇండియా) తరుపున పెద్దపల్లి జిల్లా రామగుండం 8వ కాలనీకి చెందిన కాంటెవాడ రాధ(46) ఎన్నికకాబడ్డారని నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఇండియా సెక్రెటరీ జనరల్ రాంపాల్ శర్మ పంపిన ఎంట్రీ లిస్ట్ ద్వారా తెలిపారు.ఇటీవల హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఒక బంగారు, రెండు రజితం, ఒక కాంస్య పతకాలు సాధించిన రాధ సింగరేణి ఉద్యోగి కాంటేవాడ బుగ్గాజీ సతీమణి. ఈ సందర్భంగా సెప్టెంబర్ రెండవ వారంలో భారత దేశ టీము ఢిల్లీ నుండి బయలుదేరే ఈ ఈవెంటులో పాల్గొనుటకు ప్రోత్సహించి, సహకరించిన తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్ గౌడ్, సభ్యులు గజవెల్లి పురుషోత్తం, కల్లెం మహేందర్ రెడ్డి, తన భర్తయగు కాంటేవాడ బుగ్గాజీకి రాధ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. వారు తనపై నమ్మకానికి తగ్గ ప్రతిభ చూపి పతకాలను సాధించడానికి ప్రయత్నిస్తానని, దానికోసం రోజు సాధన చేస్తున్నట్లు తెలిపింది.

# గ్రేటర్ లో బలమైన అభ్యర్థుల కోసం యత్నాలు

**హైదరాబాద్, ఆగస్టు 22**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో.. గులాబీ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒకటికి రెండు సార్లు నియోజకవర్గాల వారీగా పరిస్థితులను పరిశీలించి అభ్యర్థులను ప్రకటించారు. 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్.. మరో నాలుగు స్థానాల్లో త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అంతటా బాగున్నప్పటికీ.. కొన్ని చోట్ల బుజ్జగింపులు తప్పడం లేదు. మరికొన్ని చోట్ల అసంతృప్తులు, పార్టీ మార్పు లాంటి వార్తలు వెలువడుతున్నాయి. అయితే, సరిగ్గా టికెట్ల ప్రకటనకు ముందు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలు.. గ్రేటర్‌లో గందరగోళానికి గురిచేశాయి. అంతా బాగుందనుకున్న తరుణంలో మైనంపల్లి హన్మంతరావు.. తనకు, తన కుమారుడికి సీట్లు ఇవ్వాలని.. లేకపోతే.. ఇండిపెండెంట్‌గానైనా బరిలో దిగుతామంటూ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. మంత్రి హరీష్‌రావుపై చేసిన వ్యాఖ్యలు సైతం పార్టీలో ఆగ్రహానికి కారణమయ్యాయి. మైనంపల్లి వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కూడా ఫైర్ అయ్యారు. అయితే.. మైనంపల్లి వ్యాఖ్యల అనంతరం.. గ్రేటర్‌లో కేసీఆర్ వ్యూహం మారుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. మంత్రి హరీష్ రావుపై మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి వాఖ్యల తరువాత ఃఖీూ యాక్షన్ ఏంటి?.. పార్టీ ఏ విధంగా స్పందిస్తుంది.. అనే ఊహాగానాల మధ్య హైదరాబాద్ పరిధిలోని సీట్ల విషయంలో కేసీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.మల్కాజ్‌గిరి సీటు విషయంలో కేసీఆర్.. మరోసారి నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఒకవేళ మైనంపల్లిపై అధికార పార్టీ బీఆర్ఎస్.. వేటు వేస్తే అక్కడ ఛాన్స్ ఎవరికి..? అన్నది చర్చనీయాంశంగా మారింది. మైనంపల్లిని తప్పిస్తే మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిని బరిలో దింపే యోచనలో ఃఖీూ హైకమాండ్ ఉన్నట్టు సమాచారం. 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేసిన రాజశేఖర్ రెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఒకవేళ సీఎం కేసీఆర్.. ఈ సీటు విషయంలో మరో నిర్ణయం తీసుకుంటే.. ఆయన పేరే ప్రధానంగా తెరపైకి వచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలాఉంటే.. నాంపల్లి, గోషామహల్ సీట్లలో అభ్యర్థుల పెండింగ్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ప్రతీసారి నాంపల్లిలో అభ్యర్థిని నిలబెట్టిన బీఆర్ఎస్ .. ఈసారి మిత్రపక్షం ఎంఐఎం కోసమే పెండింగ్ పెట్టిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది

# వైకాపా అక్రమ ఇసుక తవ్వకాలు

**నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు టీడీపీ నేతలు**

**శ్రీకాకుళం**

అధికార పార్టీ అక్రమ ఇసుక తవ్వకాలతో నదీ ప్రవాహం దిశ మారి, సాగు, తాగు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారని టీడీపీ యువనాయకులు, ఉమ్మడి జిల్లా సర్పంచ్ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం వద్ద రోణంకి గ్రామంలో ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ నదీ గర్భంలో తవ్వకాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతీ రోజూ వందలాది లారీలతో రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు. నదిలో 40వేల క్యూసెక్కుల నీరు ఉన్నట్లైతే గ్రావిటేషనల్ ఫోర్స్ ద్వారా బ్యారేజీలోకి సరిపడా నీరు ఉండి రెండు పంటలకు నీరు అందే పరిస్థితి ఉండేది. 2019లో కలెక్టర్గా ధనుంజయరెడ్డి ఉన్న సమయంలో రెండు పంటలకు నీరు అందించారు. కానీ నేడు బ్యారేజీ గ్రావిటేషనల్ ఫోర్స్ ద్వారా బ్యారేజీలోకి నీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నదిలో 70 వేల క్యూసెక్కుల నీరు ఉన్నప్పటికీ బ్యారేజీకి రాకపోవడానికి కారణం నదిలో 25 అడుగుల మేర అక్రమ తవ్వకాలు చేపట్టడం వల్ల డౌన్ వైపు నీరు వెళ్లిపోతోందన్నారు. అందువల్ల నదీ ప్రవాహం కూడా భౌగోళికంగా మారిపోయిందని చెప్పారు. గొట్టా బ్యారేజీ వద్ద డౌన్ స్ట్రీమ్ వైపు బౌల్డర్ ఎప్రాన్ ,పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల బ్యారేజీకి దెబ్బ తగిలి దీనిని సైతం మరమ్మతులు చేయలేదు. రానున్న రోజుల్లో బ్యారేజీ కూడా కూలిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దానికీ మరమ్మతులు చేయడం లేదని చెప్పారు. మరోపక్క ఇరిగేషన్ కెనాల్కు రెన్నోవేషన్ లేదని తెలిపారు. మట్టి పూడికలు తీయడం లేదు. నిర్వహణ చేపట్టడం లేదని చెప్పారు. పంటలు ఎండిపోయి. పొలాలు పగళ్లు ఏర్పడుతోందని, మరోపక్క పంటలు మునిగిపోయి కుళ్లిపోయే పరిస్థితులు దర్శనమిస్తున్నాయని దీనికి ప్రధాన కారణం ఈ అక్రమ ఇసుక తవ్వకాలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు నదీ పరివాహక ప్రాంతాల వైపు ఉన్న బోర్లు నుంచి చుక్క నీరు రావడం లేదని, బావుల్లో ఉప్పు నీరు వస్తుందని దీనికి ప్రధాన కారణం భూగర్భజలాలు ఇంకిపోవడమేనని ఆవేదన వెలిబుచ్చారు. ఇంకో వైపు నదికి వరదలు వస్తే నదీ పరివహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని గతంలో ఈ గ్రామాల్లోని ప్రజలను, పశువులను ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఘటనలు ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇటువంటి దారుణాలు నెలకొంటున్నా ఐదు ప్రొక్లైయినర్లు, వందలాది లారీలతో నిబంధనలు మీరి ఇసుక తవ్వకాలు చేపట్టడం బాధాకరమని అన్నారు. స్థానిక మంత్రి ధర్మాన ప్రసాదరావు పేషీ, అధికార పార్టీ స్థానిక నాయకులు కొంతమంది అధికారులతో కలసి ఈ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం చోద్యం చూస్తోందని తక్షణమే ఈ ఇసుక తవ్వకాలను ఆపకుంటే తక్షణమే తాము కలెక్టరేట్ ముట్టడికి పాల్పడతామని ప్రభుత్వాన్ని గొండు శంకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగుపురం ఎంపీటీసీ పంగ సత్యనారాయణ,బైరి మాజీ ఎంపీటీసీ ఎండు అమ్మనారావు, అలికాం ఎంపీటీసీ నాగేశ్వరరావు, హై టిడిపి చింతు హిమగిరి ,బినిబట నియోజకవర్గం ప్రసిడెంట్ రెడ్డి గిరిజా శంకర్, బైరి మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు, డాక్టర్ పంగ రమేష్, బైరివాని పేట సర్పంచ్ బైరి నరేష్, నేతింటి జోగారావు, బగ్గు రాము, బైరి వెంకటేష్ , రెడ్డి ఉమా, పొన్నాడ కిషోర్, చీపురు రమణ, బలగ రమణ, తవిటి శ్రీను పెద్ద ఎత్తున టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నదీ పరివాహక ప్రాంత గ్రామస్తులు, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ”కురుక్షేత్ర” యుద్ధానికి సిద్ధమవుతున్న నిన్నటి క్రికెటర్ కౌశిక్ ?

**ఈటెలను “డీ” కొని పాడి గమ్యం చెరుకొనేనా ?**

**హుజూరాబాద్**




హుజూరాబాద్ లో ఎన్నికల రణరంగానికి తేరలేసింది. ముఖ్యమంత్రి కెసిఆర్ పాడి కౌశిక్ రెడ్డిని హుజూరాబాద్ అభ్యర్థిగా సోమవారం ప్రకటించడంతో ఎన్నికల వాతావరణానికి కౌంట్ డౌన్ మొదలైందనీ చెప్పవచ్చు.శాసన సభలో అడుగు పెట్టేందుకు యువనేత... మాజీ యువక్రికెటర్ పాడి కౌశిక్ రేడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. 2021లో హుజురాబాద్ రాజకీయాలు అనూహ్యంగా మారిపోవడంతో అప్పటి వరకు కాంగ్రెస్ లో ఉన్న పాడి కౌశిక్ రెడ్డిని ప్రగతిభవన్ తలుపు తట్టింది. ఏడు పర్యాయాలు శాసనసభ్యునిగా.. క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ బర్తరఫ్ కు గురైన తర్వాత బీజేపీలో చేరిపోవడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి యువకుడైన కౌశిక్ రెడ్డిని చేరదీసి ప్రోత్సాహించడం మొదలు పెట్టారు. బై ఎలక్షన్ లో కూడా ఈటెల రాజేందర్ విజయం సాధించడంతో ముందు ముందు ఆయనను ధైర్యంగా ఎదుర్కోవాలంటే కౌశిక్ వల్లనే సాధ్యమవుతుందని, ఆ డేరింగ్... ఆ డ్యాషింగ్ ఆయనలో ఉందని భావించిన కెసిఆర్ బై ఎలక్షన్ ముగిసిన తర్వాత పాడికి ఏకంగా ఎంఎల్సి పదవిని కట్టబెట్టడం రాష్ట్ర రాజకీయాలలో సంచలనం సృష్టించింది. ఈ రకంగా అతి స్వల్ప కాలంలో బిఆర్ఎస్ పార్టీలో.... ఇంటా బయట కౌశిక్ పేరు దశదిశలా వ్యాపించింది. ఎంఎల్సి పదవితో పాటు శాసనమండలి విప్.. బిఆర్ఎస్ పార్టీ హుజురాబాద్ ఇంచార్జి బాధ్యతలు ఆయనను వెంటవెంట వరించాయి. 1984 డిసెంబర్ 21 న అతిమారుమూల మండలమైన వీణవంకలో పాడి శైలజ... పాడి సాయినాథ్ రెడ్డిలకు జన్మించిన కౌశిక్ రెడ్డి బి.కాం., ఎంబిఏ పూర్తి చేశారు. భార్య శాలినిరెడ్డి, కూతురు శ్రీనికరెడ్డి హైదరాబాద్ లో ఉంటున్నారు. కౌశిక్ తండ్రి సాయినాథ్ రెడ్డి తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన 2001 నుండి టిఆర్ఎస్... నేటి బిఆర్ఎస్ లో కొనసాగుతున్నారు. కమలాపూర్ నియోజకవర్గంలో 2002లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ నుండి గెలిచిన అభ్యర్థుల గెలుపులో సాయినాథ రెడ్డి కీలక పాత్ర పోషించారు. చిన్నప్పటి నుండి క్రికెట్ పై మక్కువ పెంచుకున్న కౌశిక్ రెడ్డి జాతీయ.. అంతర్జాతీయ స్థాయిలో కొంతకాలం క్రికెట్ ఆడి తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

# 3 కోట్లు దాటేసిన ఓటర్లు

**హైదరాబాద్, ఆగస్టు 22**

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3 కోట్ల 6 లక్షల 42 వేల 333కు చేరుకుంది. ఇందులో ఒక కోటి 53 లక్షల 73 వేల 66 మంది పురుషులు ఉండగా.. కోటి 52 లక్షల 51 వేల 797 మంది మహి□ళ□లు ఉన్నారు. అలాగే 2,133 మంది థర్డ్ జెండర్ల ఓటర్లు ఉన్నారు. త్వరలో రాబోతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల టైంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక రెండో సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రా□జ్ ఈ వివరాలను ప్రకటించారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజక వర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి సోమవారం తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యం□తరాలు, కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 19 వరకు గడువు ఉందని వెల్లడించారు. సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరా□లు, దరఖాస్తులను పరిష్కరించి అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఈ ఓటర్ల జాబితానే వినియోగించనున్నారు.

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితాలో 3 కోట్ల 6 లక్షల 26 వేల 996 మంది సాధారణ ఓటర్లు ఉన్నారు. 2,742 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 15,337 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. 4 లక్షల 76 వేల 597 మంది 18 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన యువ ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2023లో భాగంగా గత జనవరి 5న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో మొత్తం 2,99,77,659 మంది ఓటర్లు ఉండగా, ఓటర్ల జాబితా నిరంతర నవీకరణలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 8,31,520 మంది ఓటర్లను నమోదు చేశారు. లక్షా 82 వేల 183 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ముసాయిదా జాబితాలో అనుకోకుండా ఎవరి పేరును అయినా తప్పుగా తొలగిస్తే.. బాధిత ఓటర్లు 15 రోజుల గడువులోగా జిల్లా ఎన్నికల అధికారికి అప్పీ□ల్ చేసుకోవాలని సూచించారు. లేకపోతే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుందని.. ఇలా చేసుకోవడానికి ఫారం?6 ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారు చేయడంలో పాలు పంచుకుంటున్న అధికారుల బదిలీలపై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఓటర్ల జాబితా సవరణలో కీలకమైన జిల్లా ఎన్నికల అధికారులు, ఉప జిల్లా ఎన్నికల అధికారులు, ఓటర్ల నమోదు అధికారులు, సహాయ ఓటర్ల నమోదు అధికారులు తదితర స్థాయి అధికారుల బదిలీలపై ఈ నెల 21వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు నిషేధం అమల్లో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఈఓ వికాస్ రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటర్ల జాబితా తయారీ బాధ్యతల్లోని అధికారులను బదిలీ చేస్తే జాబితా నాణ్యతపై ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు.



ఒకవేళ అత్యవసరంగా ఎవరైనా అధికారిని బదిలీ చేయాల్సి వస్తే స్పష్టమైన వివరాలు అందజేసి ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాలని వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) వరకు బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో ఈ నిబంధన లు వర్తిస్తాయని అన్నారు. ఎక్కువ రోజులు సెలవులు తీసుకోవడానికి ముందు ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాలని అధికారులను సూచించారు. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. 64 అసెంబ్లీ నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని.. ఆయా నియోజక వర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా నమోదు కావటం నిజంగా సంతోషకరం అన్నారు.

